# పిల్లనగ్రోవి

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D.P.R.I.
Acc. No.
10410

894.8271
GNA

కళాప్రపూర్ణ
డాక్టర్ యస్. టి. జ్ఞానానందకవి

CR

Dr. B. R. AMBEDKAR
OPEN UNIVERSITY
LIBRARY
HYDERABAD-500 033

AolA101B110

# తొలిపలుకు

రసజ్ఞపాఠకలోకమునకు

నావ్రాసిన ఖండకావ్యములలో ఈపిల్లనగ్రోవి యొకటి. పిల్లనగ్రోవి యనగా ఊదుట కనువుగా బెజ్జములువేసిన వెదురు గొట్టము లేదా మురళి అనునది మరొకయర్థము.

మురళిని యశోదానందనుడు ఊదినా డనుట జగత్ప్రసిద్ధమైన విషయము. ఆవేణువు అహిమస్తములకు నొయ్యారము నేర్పించినదట. తద్గానమునకు మొదవులు మోర లెత్తిన వట. చెట్టుచేమలు కుట్మలించిన వట. పిల్లనగ్రోవి అంతటి మహాచైతన్యమును ప్రకృతిలోని జీవరాశికి నిచ్చినదని దాని గొప్పదనము నిందుమూలముగా తెలియగలదు. పిల్లనగ్రోవి నూదుటలోని దాని గానమాధుర్యములో నెంతటి యద్భుతశక్తి నిమిడియున్నదో యనికూడ తెలియవచ్చును. ఈగాథ యొక పురాణమునకు చెందినది.

బైబిలులో దావీదు అనునొక డున్నాడు. అతడు కవి, గాయకుడు, భక్తుడు. అన్నిటికంటె ఒక మహారాజు. అతడు గూడ సంగీతకళారహస్యనిధియగుటవలన తన ఇలువేల్పును స్మరించుటకు ఈక్రిందిగేయమును హృద్యముగా గాన మొనరించినాడు.

("తంతివాద్యములతోను పిల్లనగ్రోవితోను ఆయనను స్తుతించుడి") ఇతడుగూడ పిల్లనగ్రోవిపదమునే వాడెను.

ఏది ఏమైనను మొత్తముమీద పిల్లనగ్రోవిద్వారమున ఆవిర్భవించిన మాధురీగానరసఫణితి లక్షణమట్టిది.

మఱి నా యీరచనకుసంబంధించిన పిల్లనగ్రోవి యొక వంక జీవచైతన్యమునకు భక్తిపరిదర్శనకు తావునిచ్చునో లేదో కాని తరతరాలుగా హిందూసంఘములో తైతక్క-లాడుచున్న కులవర్గవిభేదపైశాచికీ మహోగ్రపద విజృంభణతాండవోద్ధతికి కుమిలిపోయిన నా అంతరంగక్షేత్రములో మొలిచిన భావతరంగములే ఈపిల్లనగ్రోవి.

అనుక్షణము మానవసమాజములో చెలరేగుచున్న తీవ్రసంక్షోభములకు, దారిద్ర్యరేఖను దాటని బహుజనావళుల ఆక్రందనఆర్తనాదాలకు, వైవిధ్యములైన భావపరంపరలకు ప్రతీక ఈపిల్లనగ్రోవి. ఈ నా వేణువు నిక్వాణములో నినదించిన మహార్తనాదమునందలి గానము భృతిజనాళికి క్షతి జనావళికి మోదము కూర్చునో లేదో సమయపురుషుడే నిర్ణయింపవలెను. నా నిర్ణయ మేపాటిది?

నేడు సాహిత్య మెన్నిపోకడలుగా పయనించుచున్నదో కళనెఱిగినవా రెఱుగుదురు. ఆ యా ప్రక్రియల తరతమభేదములతో నాకు పనిలేదు. దానిపై పెత్తనముసాగించు నధికారముద్రియును లేదు. ఎన్నుకున్నను ఏప్రక్రియయైనను మానవకళ్యాణకారకమైనదిగా నుండవలెను. దానికి గుండెను తాకు రసప్రఫుల్లములైన శబ్దములు కావలయును. ఆ శబ్దముల

యందు రసముండకపోదు. ఆరసము హృదయస్పందనమునకు దారితీయకపోదు. అట్టిది మానవాత్మను కదలింపకపోదు. ఆవచ్చినశబ్దము అప్రియత్నశబ్దముగా రావలెను. అటుల రానిచో ఆశబ్దము హృద్యము కాదనవచ్చును. ఈ మహా సుందరశబ్దజాలము ప్రయోగించుట రసమెఱిగిన కవికే చెల్లును.

కవిత్వము రసజ్ఞలోక మానందించుటకునై పుట్టినది. ఆకవి రచనలలో నేకొంచెమైన రసమున్నచో అతడు నిక్కమైన కవిగా చెప్పికోవచ్చును. ఆకవి తర్కము, వ్యాకరణము మొదలగు నాలుశాస్త్రముల నెఱిగినవాడైనను నాతని రచనలయందు రసమింతయైన లేకున్నచో ఆరచన ప్రయోజనము లేనిదిగా మిగిలిపోవును. మఱియు పైశాస్త్రములు ఆనందము నిచ్చునవి కావు. కవిత్వమొక్కటే ఆనందమును ఇచ్చునది. ఎంతైన ఆలంకారికుల మాటనెత్తిన కవితాసాహిత్య స్వరూపములగుఱించి నెంతైన వాకొనవచ్చును. అది ఇట ప్రస్తుతము కానిది.

కవిత్వమునుగుఱించియు కవితాప్రక్రియలగుఱించియు నాభావములు నాకున్నవి. కవితాస్పందనకలిగిన ఏరచననైనను నే నాహ్వానింతును.

నా సాహిత్యజీవనయాత్రాపథములో ఉజ్జ్వలదీప స్తంభాలుగా అమలిన శాంతిక్రాంతిమందిరాలుగా నా క్లిష

ఘట్టాలలో కళాబాంధవులుగా నిలిచి సాహిత్యవిలువలను తెలిసి మనసునిలిపి మన్నించిన సన్మానించిన మాన్యరసజ్ఞశిఖామణులకు నా కృతజ్ఞతాప్రణామములు అర్పించికొనుటలో తప్పు లేదనుకొందును. వారు డా॥ బెజవాడ గోపాలరెడ్డి, డా॥ నీలం సంజీవరెడ్డి, డా॥ అయ్యదేవర కాళేశ్వరరావుపంతులు, డా॥ విశ్వనాథ సత్యనారాయణ, బి. ప్రతాపరెడ్డి, ఎల్. మాలకొండయ్య, డా॥ ఎల్. బల్లెయ్య, కె. వి. ఆర్. చౌదరి, ఐ. పుల్లన్న, డా॥ సి. నారాయణరెడ్డి, బొజ్జా ధర్మరాజు, యస్. రామాచారి, బి వి. యస్. పాత్రుడు, బి. ధనంజయుడు, పి. ఎమ్. మోహనరావు, డా॥ రెవ. కె. ఆర్. డేవిడ్, అమూల్యశ్రీ, కె. చంద్రయ్య, కె. పున్నయ్య, జె. రాజారావు, గుమ్మడి జోసెఫ్, ఎమ్. జె. సుందరరావు, సి. రాములు, జె. ఎ. పాల్, యు. బి. రాఘవేంద్రరావు, కొప్పరావూరి సత్యనారాయణ, సైలాడ పైడితల్లినాయుడు ప్రభృతివరులు గాక ఇంకనెందరో రసజ్ఞతాసింధువులకు, దయాబంధువులకు నా శారద ఋణపడియున్నది. వీరిలో కొందరకు నంకిత మిచ్చితిని. ఆ అంకితములలో నాసాహిత్యకవితాప్రసూనదామముల సమర్పించుకొంటిని. ఇది తెలుగుపాల మెఱిగినదే!

ఈగ్రంథమునకు వలసినంతగా కాకపోయినను అచ్చుఖర్చునిమిత్తము సాయపడిన ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ కార్యవర్గమునకు నాటి తూర్పుగోదావరి జిల్లాకలెక్టరు ఎ. కె. గోయల్‌గారికి నా ధన్యవాదములు.

చివరగా సాహిత్యతత్త్వమునుగురించి టి. యస్. ఇలియట్ వక్కాణించిన వాక్యములతో ముగింతును.

The 'greatness' of literature cannot be determined solely by literary Standards; though we must remember that whether it is literature or not can be determined only by literary Standards.


కాకినాడ
28-7-1982

ఇట్లు
జ్ఞానానందకవి

# విషయసూచిక


| విషయము | పుట |
| --- | --- |
| పిల్లనగ్రోవి | 1 |
| తెలుగుతల్లి | 3 |
| రౌద్రి | 12 |
| నాన్న | 14 |
| జవ్వారు | 15 |
| సందేశము | 16 |
| క్రిస్మస్ | 21 |
| విక్రమప్రభువు | 22 |
| కుటుంబనియంత్రణము | 24 |
| విద్యార్థులు | 27 |
| మద్యనిషేధకవితాసందేశము | 30 |
| మనవి | 34 |
| గండికోట | 36 |
| దేశమనగ | 38 |
| ప్రశంస | 43 |
| చైతన్యవల్లి | 46 |
| ప్రత్యభినందన | 52 |
| సిగ్గుచేటు | 61 |
| నాజరేతుప్రభూ! | 66 |
| క్రిస్మస్ | 68 |

| విషయము | పుట |
| --- | --- |
| ఎమర్జెన్సీ | **71** |
| భువనవిజయము | 76 |
| ఆశ్వాసనము | 78 |
| ఉపదేశము | 80 |
| ప్రథమవర్ధంతి | 85 |
| హెచ్చరిక | 89 |
| తుఫాను | 94 |
| అరణపుగోల | 96 |
| స్వాతంత్ర్యసందేశము | 100 |
| సుంకము | 107 |
| విశ్వసౌభ్రాత్రము | 111 |
| ఉగాది | 115 |
| ప్రత్యభినందనము | 121 |
| దుందుభి | 128 |
| గండపెండేర సన్మానము | 133 |



కృతికర్త :

డాక్టరు జ్ఞానానందకవి

6

## అంకితము

"సాహిత్య బంధువు"

శ్రీ కే. చంద్రయ్య, I. A. S. గారికి



కృతిస్వామి :

శ్రీ కె. చంద్రయ్య, I. A. S. గారు

(ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ మెంబరు)

## అంకితము

శ్రీచక్రాంకితమూర్తియైన కరుణాసింధుండు లక్ష్మీమహే
లా చిత్తాబ్జముదోచుకొన్న భువనాలంకారు డెవ్వాని ధా
త్రీచక్రాన చిరాయురున్నతులతో ప్రేమన్ కటాక్షించు శ్రీ
కే చంద్రయ్యను ప్రాజ్ఞునిన్ విపులసత్కీర్తి ప్రభావోదయున్

న్యాయప్రోన్నతజీవితాశయ కళానందైక భావుండు వి
ద్యాయోగీంద్రుడు సాధుబాంధవుడు సత్యాలాపి క్షోణీజన
శ్రేయస్కాముడు కత్తి వంశజుడు నౌ శ్రీచంద్రయాఖ్యుండు భా
షాయోషిన్మణినైగ నిగ్యముల కాశాజ్యోతి వ్రాకువ్వగన్.

దిశయిసుమంతలేని కడుదీనులకండగ నిల్చినట్టి ధీ
కుశలుడు స్నిగ్ధమానసుడు కోవిదుడోర్మికి తావలమ్ము స
ద్యశముగడించుకొన్న చరితార్థుడు చంద్రయ! మామకీనకా
వ్యశశిముఖిన్ వరించుటదిభాగ్యముగాదలతున్ మనమ్మునన్

తియ్యని తేట తేనియల తీపులునిండిన గుండెకల్గి సా
హాయ్య మహాహిమాలయ మహాశిఖరాలపయిన్ క్షుధార్తులన్
నెయ్యము నీతినిష్ఠ మెయినిల్పిన దివ్యపథానువర్తి చం
ద్రయ్యకు సుస్మితానన విరాజితమూర్తికి నాశుభావళుల్

వాజమ్మెవ్వడో సృష్టిజేసి మనుజవ్రాతమ్మునన్ భేదపున్
బాజాఅందున నిల్వబెట్టినగతిన్ ఖండించువిజ్ఞానపున్
తేజఃపుంజముగా రహించిన కళోన్మేషుండు సాలోచనా
భ్రాజన్మంగళమూర్తి చంద్రయకు పూరాభోగ భాగ్యంబులౌ

సరసవిద్యావిశేష కళాభిమానియై
నడచుసాహిత్య ఘంటాపథాన
దయివార హిత సుమదామమ్ము గీలించు
క్రమక్షమాకాంత కంఠసీమ
సకలలోకముల ప్రశాంతత నెదగోరి
స్వాగతించును గాంధి యోగికతకు
విజ్ఞానచైతన్యవీథీ విహారుడై
పలుకులమ్మకు మేల్మితిలకమద్దు

క్షితిమహోన్నతంపు కీర్తికిరీటమ్ము
గొనినమానవోత్తమునకు మృదుల
భాషణునకు రమ్యభావుకునకు గల్గు
విధిహితాన సాంద్రవిభవవితతి

నిగ్గుల్ సిమ్మిన కమ్మనైన తెలుగున్ ప్రేమించి మెల్లప్పుడున్
మొగ్గున్ జూపిన సాహితీరసికతాభోజుండు చంద్రయ్య యే
మెగ్గుల్ పల్కనిసత్కళాహితుడు సాహిత్యప్రపంచమ్ములో
నిగ్గున్ జగ్గుయశాన వెల్గుత సమున్నిద్రప్రభావాఢ్యుడై

జిల్లామేలికగా దరిద్రులకు నిస్తేజస్వరూపాలకున్
ఇల్లున్ వాకిలిలేనివారికి దయార్ద్రహస్తముం జాచి వే
నోళ్ళన్ వారిప్రశంసలంబడసి ధన్యుండైన చంద్రయ్య నా
పిల్లన్ 'పిల్లనగ్రోవి' కావ్యసుతనున్ పెండ్లాడహర్షంబగున్

పుట్టినతోనె పూవునకుపుట్టును సాజముసౌరభమ్మద
న్నట్టుల బాల్యమందెయెడయందున శారదనిల్వక్లిష్టసం
ఘట్టనలందు తాల్మిగొనిగాఢ పరిశ్రమతోడ విద్యలో
దిట్టతనమ్ముచూపిన సుధీనిధి! చంద్రయకున్ శుభావళుల్

పిలిచెనా చిందాడు పెదవిపై నమృతంపు
స్పష్టధారాధునీ శీకరములు
నిలిచెనా హర్షించు పులకితగాత్రమై
వెలుపెలుంగని ధర్మసరసిజాక్షి
కొలిచెనా వక్రచేష్టలకు తావీయని
సత్యాలదేవి సాక్షాత్కరించు
తలచెనా హిమధరాధ్రమునైన నెదిరించి
స్థాపించు జయప్రతిష్ఠాపతాక

భువనహితముగోరు స్తవనీయచరితుండు
మాటతప్పనట్టి మానవుండు
గానబుగానము కలుగుఘనుడు శ్రీచంద్రయ్య
తేజరిలుత సాహితీజగాన

నెమ్మదిశాంతిచిహ్నమని నెమ్మదినమ్మిన మాననీయుడం
దమ్మగు సాహితీయ రచనాపటిమంగని పొంగిపోవు గం
ధమ్ముగలట్టి సంస్కృతికి స్తంభము దంభములేసి యాశయా
ధ్వమ్మున సాగుచంద్రయ ప్రవర్ధిలుగాక ధరాతలమ్మునన్

కృషి పైనమ్మకమున్ గల
ఋషి విద్యావేత్త గొప్పఋజుశాలి కళా
సుషమాభాగ్యోదయుడౌ
ధిషణుడు చంద్రయ్య యున్నతిన్ గాని వరలున్

ఐయేయస్సని పొంగిపోక వినయుండై వృత్తికెల్లప్పుడున్
న్యాయంబున్ గలిగించి మానవతకున్ పట్టమ్ముగట్టించుటే
ధ్యేయమ్మంచు నెడందనమ్మిన దయార్ద్రీభూతచేతస్కుడౌ
ధీయూంజ్వల్యుడు చంద్రయాభిధుడు సందీపించు భాగ్యాలతో

రవీంగురజాడ సుబ్రహ్మణ్యభారతి
దేశీయగీతాల కాశచూపి
ఘనశాక్యముని క్రీస్తుగాంధి సత్యాహింస
ధర్మనిబద్ధపథాననడచి
ధైర్యధూర్వహులు సీతారామరాజు భ
గత్సింగు తలపుల కంజలిగచి
చైతన్యభావాల జ్వాల యంబేద్కరు
మహదాశయములందు మనసునిలిపి

అభ్యుదయమహాక్రియావళుల కెడంద
తావొసంగినట్టి ధన్యమూర్తి
దీనజనశరణ్యుడైన చంద్రయ్య నా
యక్షరాలనిలుచు నక్షరాల

సదయహృంతరాన నురుసాహసబుద్ధిని యేర్పరించె న
భ్యుదయము దేశభాగ్యమునకుజ్వల మార్గమటంచు నెంచియ
భ్యుదయపు పాఠశాలనదియున్ రచనల్ రచియించు వారికా
స్పదమగురీతిగా నడిపెచంద్రయ సాహితికిన్ విధేయుడై

వార్త వలన వసుధ బాగుపడినజాల
టంచు 'నింక్విలాబ' యన్నయొక్క—
వ్రాతప్రతిని చిన్నప్రాయాన స్థాపించి
సలిపె దొడ్డసేవసాంఘికముగ

మానవత్వము నశింపంజేయు దౌష్ట్యంపు
మూఢవిశ్వాసాల ముదలకించి
జనసమాజమునకు సౌఖ్యమ్ముగల్గించు
సామ్యవాదానకు స్వాగతించి

గణనకెక్కినయట్టి గ్రామీణ ప్రగతిని
ఖచితమ్ముగా నెదకాంక్ష సేసి
జలపుత్త్రులును గిరిజనులును జీవింప
మేలిమిగల పథకాలవైచి

చదువుకొనెడు వేళ జాతీయభావాలు
హృదయమందు రంగరించుకొనుచు
మహితమానవతకు మన్ననలిడిన చం
ద్రయ్య యశము దిశల గ్రాలుగాక

క్రమశీలుండగు చంద్రయాఖ్యుడరయంగా మూలనక్షత్రల
గ్నములో పుట్టిన కారణాన ఘనతన్ రాణించి విద్యాసము
ద్రము దాటెన్ గయిపట్టె దొడ్డపదవుల్ ధర్మైకదీక్షాపర
త్వము లక్ష్యమ్ముగ నెంచు నాదుకృతిభర్తన్ జెందు భద్రా
వళుల్

రాచరికపు చిహ్నమైచుట్టమై రాజ్య
విస్తరణకు శౌర్యవీర్యమునకు
కారణమ్ము దెలుప కత్తియా కత్తివం
శాగ్రణికి మహిని చిరాయువగుత

వన్నెకెక్కిన గుంటూరు వంగవోలు
మరియు హైదరాబాదును వెరశిమూడు
మండలాల కధిపతియై మాననీయు
చరిత సృష్టించె కత్తి వంశజుడు తొల్లి

ఆవంశమందు పేరయ
ఆవిర్భావమ్మునొంది యలరెన్ సీతా
దేవికినెనయగు రాగమ
దేవిని పెండ్లాడి సంతతిని రహిగాంచెన్

ఆసంతానము వన్నెయు
వాసియు గైకొన్నదగుటవలనను సుయశో
భాసులు పుట్టిరియందున
ధీసంపన్నుండు నాకృతిపతియొకండౌ

ప్రియసహధర్మచారిణి విమలాబాయి
ప్రతిభకల్గిన మహావైద్యురాలు
మొదటిపుత్రుండు 'ప్రఫుల్లచంద్ర' యు కూడ
జననుతింగొన్న భిషగ్వరుండు

తనర ద్వితీయనందనుడు 'ప్రదీప్ చంద్ర'
ఐ.యె.ఎస్. చదివిన ధీయుతుండు
అనవద్యగుణసుతయైన 'రత్నప్రభ'
ఐ. యె. ఎస్. కైకొన్న యమృతహృదయ

శారదయును సిరియు సంచరింతురుగాక
క్రిమతదప్పకుండ కలసిమెలసి
సౌమ్యమూర్తియైన చంద్రయ్యగృహములో
అవనితలము నిలుచునంతవరకు

మితసంభాషణునకు సు
స్మితవదనాబ్జునకు శేముషీధుర్యునకున్
శ్రుతిహితమతికిన్ విద్యా
పతికిన్ చంద్రయ్యకు శుభవర్ధిష్ణునకున్

ప్రతిభాఖనికిన్ సమతా
మతికిన్ విలసద్గుణైకమాన్యునకున్ మ
త్కృతిపతికిన్ జగతీజన
హితునకు చంద్రయ్యకు రసహృదయేశునకున్

జ్ఞానికి మానికి ధర్మ
గ్లానివిరోధికి కళావిలాసునకు సుధీ
జానికి సమతా మానవ
తా నవతావాదికి కవితా హ్లాదునకున్

అనుపమగుణనిధికి యశో
ధనికి హితవచనునకు సహృదయునకు ఋజువ
ర్తనునకు నయవినయవిభూ
షణునకు చంద్రియకు విబుధ సన్నుతమతికిన్.

కాకినాడ
28-9-82

—జ్ఞా నా న ం ద క వి

## పిల్లనగ్రోవి

ఘల్లనమ్రోగు నీచిఱుతగజ్జెలసవ్వడి విన్నయంత ప్రే
పల్లై చిగిర్చెనంట తనివారగ బృందయు పూచెనంట నీ
వల్ల మఱింతపుల్కలిడ పాడుము నాయెద నొక్కసారి నీ
పిల్లనగ్రోవినూది మురిపెమ్ములుమీఱ యశోదనందనా!

మొదవులు మోరలెత్తి యనుమోదముబొందెను నీపవిత్రపున్
పదములనంటినట్టి యమునానది పొంగెను గొల్లబొట్టెలం
దొదిగిన ప్రేమచిహ్నములహో! పులకాంకురపున్ స్వరూపమై
పొదలెను కృష్ణ! యీబ్రదుకుపొల్చును నీవొక పాటపాడుచో!

గరువించి మడుగులో తిరుగాడు కాళీయ
భుజగమ్ము నీపదమ్ముల కెఱంగె
బుడుతప్రాయమున నిన్ గడతేర్ప పాలిచ్చు
పూతన యల స్వర్గపురికి సనియె

తోడర నీడైన యెత్తులకు చిత్తయిపోయి
కొసకు జరాసంధు డుసురువీడె
తనిసి నీయుపదేశమునకు శక్రసుతుండు
బవరమ్ముసేయ గాండివముబట్టె

నిన్నుజూచి రుక్మిణీసతీప్రత్యంగ
కములు పుల్కలెత్తె కంతుజనక!
ఎడదపుల్కలెత్త నేది ? పిల్లనగ్రోవి
పాట నొక్కతూరి పాడు కృష్ణ!

# తెలుగు తల్లి

సంశీలింపగ పంచవింశతి సువర్ణప్రాయ! యుద్యత్కళా
ప్రాంశౌజ్జ్వల్య కిరీటధారిణి! మహాప్రత్యగ్రవైభోగ్యవి
ద్యాంశస్ఫూర్తి సమగ్రసంభృతచరిత్రశ్రీ మహాంధ్రోర్వి! నీ
యంశంబందిన యీ తెలుంగులకు నేడాశీస్సులందింపుమీ!

సర్వసర్వంసహాచక్ర కుడ్యములపై
చిందాడ నోగి గెల్పుసిడము నిల్పి
చివ్వసేయగ కాలుద్రువ్విన వైరివ
ర్గమ్ము భీతిల్ల పౌరమ్ము నేర్పి
భృతిలేక చితికిపోయినయట్టి కటికిపే
దలపైని కరుణాశ్రువులను చిమ్మి
వ్యవహారసంబంధవాణిజ్యమును చేయ
పొరుగుదేశాలతో పొందుసల్పి

యుగయుగాల వైభవోన్నతచరితమ్ము
నిలుపుకొంచు ధారుణీతలంపు
పరిణతు లందికొన్న రమణీయమూర్తివి
వెలుగుపలుకు వెల్లి! తెలుగుతల్లి!

నీ బాగోగులుచూడ నీ బ్రతుకులో నిండింపభాగ్యాలు నే
డో బంగారపురంధ్రి వచ్చెను వినూత్నోత్సాహచైతన్యదీ
క్షాబద్ధుండగు అంజయాఖ్యుడు ప్రశస్తశ్రీలు గూర్పంగ నీ
దే బాగ్గెమ్మ సుఖంపు మోవెలుగు వెల్లీ! తెల్గుతల్లీ!

యిలన్

తూరుపు రేక చీకటులదొంతరలన్ తొలగించునట్లు దీ
ఘోరమ.శీయపద్ధతుల సాంతముగా చెడుపోవునట్లు వి
స్ఫారసుఖోన్నతుల్ సహనశాంతిమరీచులు నిండుగా జగా
యీరజతోత్సవమ్ము వెలయించుత నీకు మహాంధ్రభూమినీ!

మాయంబైన సమైక్యసాధనమహోమాన్యత్వసోదర్యచి
హ్నాయత్తంపు సుగంధమారుతము లిప్పైనన్ గుబాళించుచో
నీయాంధ్రప్రజకున్ ఘటిల్లెడినితల్లీ! మేల్మిసౌభాగ్యముల్
పూయింపింపు సమేకతాసురభిళమ్మున్ పుత్త్రులస్వాంతమున్

సమతయించుకలేని స్థానాన నారునా
ప్రాంతీయతత్వస్రవంతిధార
కలుషకర్మఠులున్న నిలయాన పూడునా
దౌష్ట్యంపు వర్ణభేదాలయూబి

బ్రతుకీడ్వఁగలవారి క్షితిలోన తగ్గునా
హైన్యమా రాజకీయాలరభస
కలితీ దగాజనమ్ముల ధరన్ మాయునా
కుటిలంపు తలఁగోకికొనెడు చేష్ట

క్రీతుదాసులున్న పృథివిలో సమయునా
కృష్టమైన దేబెరింపుబ్రతుకు
మొలవనిమ్ము సహనము సుతాళిహృదయాల
పలుకువెలుగువెల్లి! తెలుగుతల్లి!

ఖుసి రహాయింప నీచరితకున్ మెఱుఁగుల్ పచరించి దిగ్దిశా
విస్తృతయశస్సు నిల్పుకొని వేడుకలందిన నీకుమాళ్ళలో
నసహనదృష్టి పెచ్చరిలినందున నీబహునాయకత్వపున్
పసకు పసందుచెడ్డది నివారణచేయుము తెల్గుతల్లిరో!

నీయాతిథ్యము నీయఖండచరితన్వీక్షించి పాశ్చాత్యదే
శీయుల్ సన్నుతిజేసి నీదయిన యూర్జిత్యంపు మాధుర్యభా
షాయాదోధిని నీది యెంతటిప్రశంసల్ సేసిరో తెల్గుత
ల్లీ! యానందఝరీతరంగములు మాయీగుండెలం బాఱెడిన్.

సాతవాహనుధరాజాను లేలిననాటి
సమధర్మతత్త్వమ్ము సాగునాడు
సహనశీలురు కుతుబ్షా లేలుబడి నాటి
మతసామరస్యమ్ము మలగునాడు
ఘనుడు రాయలకాలమున లచ్చి కవుల దా
రిద్ర్య దేవిని త్రస్తరించునాడు
ఆంధ్రజాతిని సమయమున మల్లారెడ్డి
గానబుబత్తిని యాదుకొన్ననాడు

తెలుగునాడు కాకతీయు లాంధ్రోర్వీశు
లేలునాటి శౌర్యమేలునాడు
సంతసించినట్టి సంతోష మీనేటి
తెలుగుజాతికిమ్ము తెలుగుతల్లి!

కళలన్ మెచ్చినయట్లు మెచ్చితుదకున్ కాలుష్యపున్ భేదపున్
కులవర్గాలను ప్రోత్సహించు రసికుల్ కుమ్మక్కుగానున్న యీ
తెలుగున్నేలను సంస్కృతిప్రసవ మేతీరున్ గుబాళించు నం
చెలుగెత్తన్ ఫలమేమి? తెల్గుదొరసానీ! సత్పురంధ్రీమణీ!

చుట్టును జేరి జంబుకపుస్తోత్రములన్ పొనరించి పొట్టకై
యెట్టియసభ్యకార్యములనేనియు సేయుచు సంచరించు నీ
బట్టుల వందిమాగధుల వంచకులన్ కని పెట్టుచో వ్యథా
ఘట్టము లంతరించును సుఖాలొనగూడు మహాంధ్రభామినీ!

పరవళ్లుద్రొక్కి గ్రుడ్లురిమి పాఱినవంశ
ధారామహానదీ దర్పమునకు
కుటిలదంష్ట్రికలనెక్కొను ధారణాధాకి
నీపిశాచీనైచ్యనృత్యమునకు
మానవత్వము నశింపంజేయ నుద్ధతిన్
సాగు నస్పృశ్యతాజాడ్యమునకు
పుడమిని మేలుకొల్పెడు కావ్యములువ్రాసి
సిలుగులందెడు కవిసింహమునకు

నెంతకుతిలపాటు నెంతదుఃఖోద్విగ్న
హృదయమవై చరించి యీమహాగ్ని
కీలలన్వహించి కెరలుచుంటివో నీకు
తెలియదా? జయోస్తు! తెలుగుతల్లి!

బులిపింపుల్ గలమోములో మొసలినవ్వుల్ చిందగా తీయగా
పలుకుల్ పల్కన తంతుగాండ్ర కేటులభ్యాసమ్ముగావించి ని
శ్చలధర్మైకపథమ్ములో నడువగా శాసింతువో నాడె యు
జ్జ్వలభాగ్యమ్ములు త్రవ్వితండమగు వహ్వా ఆంధ్రరాజ్యేందిరా!

ఏయాకాశపుదిక్కులో గలసెనో యేవార్ధిలో దాగెనో
ఏయౌన్నత్యధరాధ్రమందొదిగెనో యీవేళగాన్పింపడే
మీ! యానీతిసహస్రతిగ్మరుచి తల్లీ! భ్రష్టమై హైన్యమై
పోమెన్ మాతలలోనిభావములు మార్పుం దెచ్చి పోషింపుమీ

కమ్మగరెడ్లు వెల్మలు వికాసము తెల్గులకీయగా ప్రశ
స్తమ్ముగరాజ్యపాలనము సల్పిరటంచు చరిత్రసెప్పు నా
కమ్మని పాలనంబిపుడు గల్గవలెన్ తెలుగుల్ సమైక్యగం
ధమ్మును పూసికోవలయు తప్పదు లే, నవతాజగత్తులో!

ఉఱుమడే ఘనపోతులూరి వీరబ్రహ్మ
సంఘానజరుగు దౌష్ట్యమ్ముగాంచి
చెనకడే రెడ్డివేమనయోగికవిమూర్తి
కులమతార్భటుల సంకెలలకలిగి

విసుగడే సంస్కర్త వీరేశలింగమ్మ
బుద్ధిమాలినకృత్యములకు వగచి
విడువడే కన్నీటిబిందువుల్ బ్రహ్మర్షి
పతితకులాల దుర్గతికి కుమిలి

అతులధైర్యశాలి అల్లూరి నొవ్వడే
స్వేచ్ఛలేనిజాతి స్థితినెఱింగి
వారిలోన మసలు ధోరణిసుతులలో
నిలుపుకొనుము మరల తెలుగుతల్లి !

ఇటనిజమైన సత్కవికి నింతయు గౌరవమీయనట్టి సం
కటపుపరిస్థితుల్ కలుగునా డిది చుట్టుపరిభ్రమించి చ
ప్పటులను గొట్టువారలకు పట్టముగట్టిన దేశభక్తు లె
ప్పటివలె తెల్గుతల్లి! కులవర్గవిభేదము లెంతు రెన్నగన్.

చాటించు నీమహోజ్జ్వలకళాశక్తి ని
ల్చిన యజంతాకుడ్యశిల్పరచన
చూపించు నీతపస్సునకు తార్కాణగా
తెలుగు కైతల్ మేలిపలుకుబడులు

చవిజూపు రసికతాజనము హ్లాదింప నీ
త్యాగయ్య మధురగానామృతమ్ము
వినిపించు భక్తాళితనువు లుప్పొంగ నీ
బమ్మెరాన్వయునిదౌ భాగవతము

పొలుచు నీదుకూచిపూడినాట్యకళా మ
హావిభవము, చెప్పనంతులేని
యశముగల్గుదాన యానాటిచరితమ్ము
నిలుపుమమృతవల్లి ! తెలుగుతల్లి !

బహుతోషమున నాత్మబలిదానమిచ్చిన
పొట్టిరాముని త్యాగఘట్టనమ్ము
చెడుగువైరులకు ఱొమ్మిడియెదిర్చిన ప్రకా
శము ధైర్యసాహసజయచరిత్ర
తెలగాణమును మేలుకొలిపిన సురవర
ము ప్రతాపరెడ్డి యమోఘబుద్ధి
ఆంధ్రజాతిసమైక్య మలరార శ్రమపడ్డ
మాడపాటి యనన్యమహితదీక్ష

తెలుగునాటికే యుజ్జ్వలోజ్జ్వలప్రశస్తి
సంఘటిల్లెను నాటిపసందుచరిత
తెలుగుజాతిహృద్వీథిలో తిరుగనిమ్ము
దివ్యభావాలవల్లి ! మా తెలుగుతల్లి !

తల్లీ ! యీరజతోత్సవాలు సముదాత్తంబైన నీపేరు రం
జిల్లన్ జేయునుగాక ! ధర్మగుణరాశీభూతులైనట్టి నీ
పిల్లల్ తెల్గులుసౌఖ్యసంపదలతో విశ్వంభరాదేవి వే
నోళ్లన్ మ్రొక్కఁ– సుఖింత్రుగావుత! చెలంగున్ గాక! శాంతి
ద్యుతుల్.

1-11-1980

— ❖ —

# రౌద్రి

వాకోబూనగ భ్రష్టనాగరకతా పైశాచికీఘోర హిం
సాకాండోద్ధృతనాట్యభంగిమల, యీర్ష్యా ద్వేషణోదగ్రహా
హాకారమ్ములతాండవార్భటుల విన్యాసాల మూర్తాన రౌ
ద్రీ ! కాల్వెట్టిననీకు స్వాగతమునందింతున్ శుభాకాంక్షినై.

వచ్చి సిద్ధార్థియేమి మాకిచ్చినాడు?
పగలు తగవులువర్గాల భుగభుగలను
రేపెనటుగాక రుద్రాంశ రేఖగలుగు
నీకతానభాగ్యాలు సంధిల్లుగాక !

హాసజ్యోతులు సౌఖ్యజీవితములున్ హ్లాదైక సంస్కారవి
ద్యాసౌరభ్యములున్ సమైక్యధిషణావ్యాహార రాగమ్ములున్
భాసింపింపగ జేయ నేమియు తలంపన్ లేదు లే; యెందుకో
ఈసిద్ధార్థి మఱేమి సేసెదవో రౌద్రీ! నీదెభారమ్మగున్.

సమతాపరిజ్ఞాన చైతన్యకాంతులు
గుడిసెలోనికి జొచ్చుకొన్ననాడు
సగటుమానిసి నిరాశాజీవి యెదలోని
దుఃఖతాపజ్వాల తొలగునాడు
కొండంతబలముతో గుడ్లురుమినటంచు
ధరలతైతక్కలు తగ్గునాడు
అర్హమౌ సమతను గర్హించు కులమయ్యె
హృదయాన మాత్సర్యమింకునాడు

నాకయినవానిదగు జీవనమున చెలగు
కొలదిపాటైన యానంద గుంఫనమ్ము
నిలుచుచో నాల్గుకాలాలు నిక్కువముగ
పలుకనాకింక నేమి కావలెను శాద్రి !

ఎన్నో వేలయుగాదులీ ధరణిపై నేగెన్ వచింపన్ మఱిం
కెన్నోయిట్టియుగాదు లీయవనిపై నేతెంచుగానీ క్షుధా
ఖిన్నస్వాంతుల కేమిసంతసముగల్గెన్ దోపిడీసంఘమం
దెన్నాళ్ళిట్టులసాగుగంతులిడి ! శాద్రి! రుద్రభాగేశ్వరీ !

ఆకాశవాణి, 17-3-80.

నాన్న !

అవలోకింపగనీయనంతమగు మిథ్యాభ్రాంత సత్యాల్పరే
ణువున్నై కొట్టుకపోవునన్ను భగవంతున్వేడి నా కోస మే
పువులన్ పూజలుసల్పి వేడ్కగనినావో! తెల్గుదేశాన నా
యవతారానకు కారణంబయిన నాన్నా! నీకు
సాష్టాంగముల్.

## జ హ్వా రు

అఱ్ఱులుసాచె నీభువనమంతయు నీదగు చెల్మిగోరి యే
గఱ్ఱియు లేసినీమహిత గాఢమహోధ్ధికతా సుధీసుధల్
జుఱ్ఱుచు మేటి భారతముజూచెను నీపరిపాలనమ్ము నో
ఎఱ్ఱగులాబి కోటునధరించిన జహ్వారు! చెంగనాలగున్.

27-5-1974

H

## సందేశము

స్తోమంబున్ సహనంబుగల్గు హిమవత్ క్షోణీధ్ర కన్యాకుమా
రీమధ్యస్థలి. నాసహోదరులకున్ ప్రేమున్ ప్రపంచింతు నా
శామానోజ్జ్వల భావిభారతమహాసందేశ మీనాటి బా
ధామాలిన్యపుజీవితాల కురుచైతన్యమ్ము గల్పింపగన్.

విశ్వసర్వంసహావీథులలో శాక్య
సన్న్యాసిగీతాలు సాగునాడు
చలిచీమయునుగూడ నలిగిపోరాదన్న
జినమహాత్ముని పల్కు సెల్లునాడు
ప్రతివాని ప్రేమింపవలెనన్న క్రీస్తుని
సందేశగంధమిం పొందునాడు
పరమేశుదృష్టినందఱొకటేయన్న రా
మానుజువాగ్గంగ మసలునాడు

సత్యశాంతి ధర్మసౌజన్యరూపాలు
దీమసమునకలిసి తిరుగునాడు
విశ్వదిశలు మ్రొక్క విజయకేతనమెత్తు
శీర్షమెత్తి దివ్యదార్షభూమి!

క్షితికొకనాడు పాఠములు సెప్పెను సంస్కృతిగూర్చి భారత
క్షితి యదినేడునీవలనఛిన్నము పైకి రహించుచో జగ
ద్ధితమయినిల్చు నీదయిన దేశముకీర్తి; వచింపగా నసం
గతమగుచేష్టలన్ సలుపగాదగదెన్నడు మంచినెంచుమీ!

దురహంకారపు దుష్టభావుకుల తంతుల్ సాగనీరాదు దు
ర్భరదైన్యమ్మున మున్గుపేదలక్షుధాజ్వాలల్ విజృంభింప రా
దరయన్ స్వార్థముగూడు కట్టుకొననీయన్ రాదు సంఘాన సో
దరభావాలు సమైక్యగంధలహరుల్ తారాడయత్నింపుమీ!

ఒక్కడు పచ్చగా బ్రతుకుచుండిన వానినిగాంచి నిప్పులన్
గ్రక్కినవాడు బాముకొనగల్గిన దేమి? సహిష్ణుతాసుధా
ఋక్కులకాలవాలమగు నీఋషికల్పుల దివ్యభూమిలో
మిక్కిలితాండవింపవలె మేదురముల్ సముదారతత్త్వముల్.

గుండెద్రవింపజేయు రసగుంఫపు కైతల నల్లు సాహితీ
శౌండుని కాదరంబిడగజాలు రసజ్ఞకళాపదాఢ్యనీ
నుండొకడున్నచో నపుడనూహ్యము సంస్కృతి విస్తరించి బ్ర
హ్మాండము నుద్ధరింపగల దట్టిది నేడిటచుట్టి ముట్టెడిన్.

బాహాటమ్ముగ ఓమ్ముసూపి పెలుచన్ వర్ణక్రుధాభూత స
న్నాహప్రోద్ధతి యూవహించునెడ జ్ఞానజ్యోతిచల్లారి దు
ర్మోహాంధమ్మునముంచు దేశమును మీరున్ మీరుసంభావ్యపున్
సౌహార్ధమ్ముల చెట్టవట్టుకొని దేశానన్ ప్రయాణింపుడీ.

జాబాలునకు బ్రహ్మచర్యదీక్ష నొసంగి
నట్టిగౌతమమహాని పుట్టినాడు
జాతిభేదముగూర్చి శంకరస్వామికి
శివమూర్తి పాఠమ్ము సెప్పినాడు
అరుసాన తొలికులాంతరపు పెండ్లికి పరా
శరుడు త్రోవనుచూపి యరుగునాడు
మనసార క్రొత్తదంపతులు వసిష్ఠుని
సతికి జోహారులు సలుపునాడు

మానవత్వమెంతగానో నింగినిదాక
పెరిగిపోయినదియ గుఱుతుసేయు
మహితమైన నాటి మానవత్వపు విలు
వలు రహించి పెరుగవలయునేడు.

శ్రేయోదాయకమైన పద్ధతికి స్వస్తింజెప్పి దుర్భావనా
ఛాయల్ వెంబడిసాగుచో నిచటదౌర్జన్యమ్ము రాకాసియై
న్యాయంబున్ దిగమ్రింగి మానవత కన్యాయమ్ము చేకూర్చుని
శ్లేమైనన్ నవభారతాభ్యుదయ మిట్లే గాలి కల్లాడెడిన్.

మొరయునా బహుకాలముననుండి పఱతెంచు
నార్షధర్మైక ఘంటారవమ్ము
విరియునా మహితబుద్ధీమహానంద
నోద్యానసమతా మహోద్యమలత
కురియునా యుపనిషద్గాఢతత్త్వకుజమ్ము
విందొనర్చెడి ఫలానందరసము
మురియునా ఘనమునీశ్వరుల బోధ సుధార
సప్రవాహాన విశ్వభువనమ్ము

ఇదిజరుగునాడు మానవులెల్ల రొకటి
యై ప్రయాణించెదరుగాక! యదియలేని
నాడు మానవత్వమునకు చీడపురుగు
దాపురించిన యట్టి చందంబె దోచు.

ఇటకర్ణుం డను వాని నైపుణికి లేదే? యింతగుర్తింపదె
ప్పటిదో యంచని యూహసేయగతలంపన్ రాదు నానాటికి
ప్పటికిన్ భేదమొకింత లేదనెడు విద్వత్సూక్తి తథ్యమ్ము ది
క్తటముల్ మెచ్చగ నీవిధానమును విధ్వస్తమ్ముగావింపుమీ !

ఈవేళ నవభారతావనీ తలములో
కులమతమ్ములు క్రుమ్ముకొనగరాదు
ఈరోజు నడివీథిలో రాజకీయాలు
శిరమెత్తి గర్వాన తిరుగరాదు
ఈనాడు సంఘసేవా నూన కార్యాలు
స్వార్థమానవుడు చేపట్టరాదు
ఈదినమ్మున ప్రజాహితధర్మపీఠాన
దుండగీడెపుడు కూర్చుండరాదు

నాడు నాల్గుదెసలు నవనవోజ్జ్వలపథ
కములు శాంతియుతముగా చెలంగు
సుఖతరంపు సౌధశిఖర మారోహించు
చిందులాడి నవ్యహిందు ధరణి.

## క్రిస్మస్

కలహాలెందుకురాని యట్టితరహాకార్పణ్య కాలుష్యముల్
గల లోకానకు రక్షణంబిడగ స్వర్గశ్రీలపోనాడి మ
ర్త్యుల, రక్షింపగవచ్చినట్టి నజరేతుగ్రామవాసీ! మహో
జ్వాలశాంత్యున్నతమార్గమందు భువి ప్రస్థానింపగా జేయుమీ!

జనులకంటికి గనరాని స్వర్గపురిని
తృణముభాతిగా దలచి యీపృథివితలికి
పరమహర్షమ్ము నియ్యగా వచ్చినట్టి
ఘనయెహోవకుమార! స్వాగతము నీకు.

ఈపాపాల వ్యథాక్రుధావసుధ కీవెంతో మహారక్షణ
శ్రీపీయూషముపంచి పెట్టగ జగచ్ఛ్రేయోర్థమై కన్యమే
రీపావిత్ర్యపుగర్భ మాదొడిగి తంద్రీపుట్టినావయ్యా! నే
డీపర్వమ్మున ధాత్రికౌత సుఖతా హేవాక సౌభాగ్యముల్.

## వి క్ర మ ప్ర భు వు

మురువునుగూర్చుకైతకు ప్రమోదమునంది బహూకరించుమీ
పరమ రసజ్ఞతామధురభావనకున్ పృథివీశ! విక్రమే
శ్వర! యివిగో నమస్సులు పచారముసల్పుచునున్న మీయశ
శ్చరితకళావధూటి కనిశమ్ముభృశమ్ము ప్రశంసలయ్యెడిన్.

తలపన్ గుండె చెమర్చు నీ తెలుగు పద్యాలన్నమీవంటి యు
త్కళరాజన్యులకెట్లు నచ్చినవో? యుత్సాహమ్ము రెట్టింపనాం
ధ్రులలో మీరుమహాంధ్రులై మెలగి యెంతో తెల్గుభాషాసము
జ్జ్వలదీప్త్యున్నతికై శ్రమించిరిబుధశ్లాఘ్యా! నమోవాకముల్.

విజ్ఞత రాణసెందవలె విశ్వమునందని మీరలెన్నో మా
నోజ్ఞములైన కల్పనలు నూల్కొనజేసితిరెంచ విద్యయన్
యజ్ఞముకోసమై జయపురాధిప! లక్షలుఖర్చువెట్టి మీ
విజ్ఞతకున్ ప్రతీకలివి విశ్వహితైషివి! విక్రమప్రభూ !

ఈ రసాంధ్రసాహితీ రాజ్యసీమలో
తెలివిదప్పినట్టి తెలుగుకళకు
పొలుపుమీర గొప్ప మెలకువ గల్పించి
విందొనర్చినావు విక్రమేశ !

(విశాఖపట్టణములో నొకనాటి వర్ధంతిసభలో నాశు వుగ జెప్పబడినవి. నాటిసభకు శ్రీ తెన్నేటి విశ్వనాథముగారు అధ్యక్షులు)

# కుటుంబ నియంత్రణము

శిష్యుడు :

జగతీచక్రమునందు మిక్కిలిప్రశంసల్ గాంచు విజ్ఞానని
మ్నగలన్ పాఱగజేసి సంపదలతో భాసిల్లు నీభారత
ప్రగతిన్ ముక్కలుసేయు లేమికి జనాభాపడ్డ యీనాటి దు
ర్భగదైన్యమ్మున కేది హేతువు? గురుర్బ్రహ్మా! వచింపంగదే!

వలసినయంతభూవసతి ప్రస్తుతికెక్కిన శైలరాజముల్
కలకలులేని తోయములు గల్గునదీనదముల్ మహాటవీ
ఫలములు సర్వలోహములు బంగరుపంటలు పండుచున్నభూ
స్థలమున తిండితిప్పలకు క్షామమెటుల్ గలిగెన్ గురూత్తమా!

ఇతరులు తిన్నగాని మఱియెన్నడు సాపడనట్టి భారత
క్షితియిపుడెంతయో ప్రగతిచెంది ధరాతలమందు కీర్తిగాం
చలిముదమున్ చరించుటలు నందఱెఱింగినదేకదా! జన
స్థితికి విషాదమందుట నిసీ! తగుకారణమేమి చెప్పుడీ !

ఒకరుగాదు దేశముజ్జ్వలభవితవ్య
పథమునందు నడువవలయు ననుచు
చెప్పువారు జనుల శ్రేయస్సు గోరుచు
కారణమ్ము దెలుపగోరువాడ !

ఇంతకుముందు నెన్నడును నీసదుపాయములున్ ప్రణాళికా
కాంతుల జాడవీడెసల గానగలేవనవచ్చు భారతం
బంతయు సర్వసౌఖ్యములయందు విభాసిలగావలెన్‌గదా !
అంతటి దింతగా దిగులునందుట కేమిటికారణంబగున్.

గురువు :

ఎన్నియుగములు దాటిననేమి? ఈయ
ఖండభారతదేశానకలుగు భూమి
యున్నదున్నట్టులేయుండు నన్నదొకటి
నిజము హేమసస్యాలుపండినను తుదకు.

ఎంత యుత్పత్తి పెరిగిననేమి? యెంత
యంత్రివస్తువుల్ పెరిగిన నసలు సేద్య
భూమిపెరుగుట కాధారమేమిలేని
కువలయానకు నేరీతి కుతుకమబ్బు ?

అతిమహనీయమైన పథకావళి వేలకువేలమించి య
ప్రతిహతమై నిరంతరము భారతమందున సాగుచుండ దు
స్థితికి ప్రధానమైన దొకచీకుసమస్య ఘటిల్లె నీజన
ప్రతతికతాన నీజనవితానము తగ్గినచో సుఖంబగున్.

ప్రగతివలెనన్న నీజనప్రభవ మిచట
నాగిపోవలె నాడు మహాభ్యుదయము
నలువలంకులు నిండి తాండవమొనర్చు
దేశజనయిత్రి యానందతీర్థమాడు.

తిరుగుముఖమ్ముపట్టును యథేచ్ఛగ సంచరణంబొనర్చి గ్రు
డ్లురిమిన క్షామదేవత కుటుంబనియంత్రణమొక్కటే మహా
శరణము భారతీయులకు సత్వరశాంతికి దివ్యదోహద
స్ఫురణము శిష్య! భాగ్యములస్ఫూర్తికి తావల మీధరిత్రికిన్.

ఆకాశవాణి 9-10-76 (విజయవాడ)

## విద్యార్థులు

ఆవేశమ్ముల సమ్మేలన్ మఱచి విద్యాచింతనాధ్యేయపున్
త్రోవల్ పోవుచు శాంతికాములయి యేదో దివ్యచైతన్య ధా
రావారాశిని నోలలాడుచును హర్షానం బ్రయాణింతు రీ
నా విద్యార్థులు వారిలోనవిరిసెన్ నవ్యోదయాశాఘృణుల్.

ధూర్తభావాన నేదో వంక పెట్టి కా
లానకు "స్కూలు"కు రానివాడు
తినమర్గి తలిదండ్రులను మభ్యపఱచి ద
బ్బరలాడి వీథిలో తిరుగువాడు
నలుగురి కుఱ్ఱవాండ్రను వెంటనిడుకొని
చెడునినాదమ్ములు సేయువాడు
సరదాకునైన పుస్తకము చేబట్టక
వేళకు పాఠాలు విననివాడు

పాఠశాలలోన పనిచేసినట్టి నా
పాతికేండ్ల యనుభవమ్ములోన
బడికి నేడువచ్చి పాఠాలు విద్యార్థి
వినుట నవశకాన గనుట నిజము.

చదువన్నన్ హృదయాన నెంచక తమాషాయంచు భావించి త
ప్పిదముల్ సేయుచు సత్యమార్గమును విద్వేషించి వర్తించు వా
డది తప్పించునెఱింగి నేడు క్రమతావ్యాయామబద్ధ స్పృహా
స్పదనిర్మాణ ధురీణుడౌట కెద సంభావింతు నీచర్యకున్.

ఏదో హేతువు దీనికయ్యెడినిగాదే? లేనిచో నేటికిం
కేదీతావల మీప్రశాంతతకు నెన్నెన్నో యుగాల్ దాటె న
భ్యుదయంబింతకు సంభవించినదె? నేడూహింప విద్యార్థులన్
పృథులశ్రాంతిపథాన నడ్పినయమెర్జెన్సిన్ ప్రశంసించెదన్.

గుంపులుగుంపులై తిరుగుకుఱ్ఱలు వేళకు పాఠశాలకున్
జంపానరింపకుండ కడుచక్కగవచ్చుట దేశికున్ వచ
స్సంపద లందుకోగలుగుజాలుట గొప్పవిశేషమే? చెలా
యింపులుమాసిపోయినవి యీసరికాత్యయిక ప్రపత్తిచే.

తొల్లిటలేనిదేదో యొకతోరపుక్రొత్తదనమ్ము పిల్లలం
దెల్లెడ గానిపించుట ప్రహృష్టమునందెద భావికాలసం
ఫుల్లచరిత్రశోభితులు సుందరరూపులు పిల్లవాండ్రు నే
డెల్లదిశల్ ధ్వనించినవి యీనవజాగృతి డిండిమధ్వనుల్.

అనుటకేమి ? పదియునెనిమిది మాసాల
చరితలోన మార్పు జరిగిపోయె
క్రొత్త వెలుతురబ్బె క్రొత్త చైతన్యమ్ము
బహువిధాల పిల్లవాండ్ర కబ్బె.

నేడురా నాపిల్లవాడు నిశ్చింతగా
నక్షరజ్ఞానమ్ము నందుకొనుట
నేడురా విద్యార్థి వేడుకమై పాఠ
శాలకువచ్చి శిక్షణముగనుట
నేడురా చదువుతోనాడు నావిద్యార్థి
క్రమతాగుణంబులు గలిగియుంట
నేడురా నాకుఱ్ఱవాడు నాయిష్టమ్ము
నిట తలమీద కెక్కించుకొనుట

ఒక యపూర్వచలన ముఱ్ఱూతలూగింప
వెలుగుబాట పాఠములను వైచి
నడచుచున్నవారు నాడు విద్యార్థులు
దేశమున కిదొక యదృష్టరేఖ.

31-1-77 ఆకాశవాణి (హైదరాబాదు)

## మద్యనిషేధ కవితాసందేశము

సత్త్వసంభృతమౌచు జాడ్యమ్ములుంగని
దేహదార్ఢ్యానకు దెబ్బగొట్టి
శిరమెత్తి హాయిగా తిరుగాడు వేళలో
తోరంపుబ్రదుకులో దుమ్ముసల్లి
ప్రతిభాప్రయాణ మార్గములోన నిలుచుండి
భవితవ్యమున కడ్డుబండ వైచి
వృద్ధికాదగిన వివేకమ్ము నింకించి
యింటిళ్ళపాదిని మంటగలిపి

తనమహాశక్తి యొక్క యూపునకు నిట్టె
ధారుణీతలమెల్ల దద్దరిలిపోవ
మద్యమనియెడు దయ్యంబుమసలు లెండు
దాని గడ తేర్పగా నేడు తరలిరండు.

అది యెవ్వానిశిరమ్ముపైనిలిచి నృత్యంబాడ కాంక్షించునో
అది యేచోటుల జాతరల్ సలుపసేయన్ గ్రుక్కిళుల్ మ్రింగునో
బదవల్ రాసులు రాసులై పెరిగి తిప్పల్ గూర్చు నచ్చోట న
య్యది దేశాన కనర్థదాయకము చెండాడన్ వలెన్ దీక్షమై.

గొడ్డలిపెట్టు కీరితికి గోడునకున్ నిలయమ్ము వంశపున్
దొడ్డచరిత్రకున్ విషము ధూర్తతకున్ సయిదోడు లేమికిన్
గడ్డ కుటుంబజాగృతికి గడ్డుసమస్య నిరంతరంబెదో
యడ్డగు మద్యభూతమును నంతముసేయుట యుక్తమౌసుమీ!

ఈమద్యమ్మను భూతమిచ్చటనె యుల్లేయున్నచో భారత
క్ష్మామర్యాదకు సంస్కృతిప్రభకు ప్రస్తావింపమచ్చె యహో!
భూమీచక్రములో సదా యపయశంబున్ పొందు మద్యంపుదు
ర్వ్యామోహమ్ము నశించుచో వెలుగుదివ్యస్వర్ణభాండారముల్.

తనసంతానము గోలుగోలుమన సంతాపింపజేయున్ నిరా
శను జీవింపగజేయు దైన్యమున దుష్టంబైన కార్యాలకున్
చనగాజేయు సమాజమధ్యమున భ్రష్టత్వమ్ముగల్పించు గా
వున మద్యమ్మును పాఱద్రోలినశుభమ్ముల్ వెంటరాపాడెడిన్.

తమితోడనెపుడు మద్యము త్రాగి యొక్కండు
తనకూతు సౌశీల్యమును హరించె
మద్యమ్ము సేవించి మత్తుడై యొక్కండు
దుష్టశిష్యులవల్ల దోపియయ్యె

మద్యపానముచేత మహనీయతనుగోలు
పడినారు జేజేలవైరులెల్ల
మధుసేవనము కడుమరగినందున దేవ
తలు శక్తిగోల్పోవవలసివచ్చె

ఈ మహాపిశాచమా మద్యపానమ్ము
దేవతలకు గట్టిదెబ్బగొట్టె
జగతి మానవునకు ప్రగతిపథమ్మేది?
మానవలయు మద్యపాన మింక.

రోగములబ్బు జీవితములో సుఖరాగము లింకిపోవు బా
గోగులగాంచుపత్ని హృది గొందలమందును పిల్లవాండ్రు దు
ర్యోగముపాలుసెందెదరు యోచనసేయగ దుర్భరంబగున్
త్రాగినవానిజీవితవిధానము త్రాగుట మానగావలెన్.

ప్రవిమలజీవితమ్మును నిరర్థకమైనపథాననడ్పు నా
సవమునుగ్రోలి జీవితముసల్పినవానికి నీశ్వరాతలిన్
చివరకు లాభమెంతనిన చేతికిచిప్పయెవచ్చు నీనిషా
ధవులకు త్రాగుబోతులకు ధర్మముపీడిన కంకుభట్లకున్.

పేద గొప్పదనము లేదు మద్యపిశాచి
కింటనున్నసిరుల గెంటివైచి
సంతసించులే, నిషాకూర్చి యేడ్పించు
లే; యదొక్క-జన్మవృత్త మరయ.

మచ్చునకైనను మద్యపానపిశాచి
దేశాన తలయెత్తి తిరుగరాదు
చెడుగు పెంచిన యీ నిషిద్ధాంగణములోన
మనుజునిపాదాలు మసలరాదు
పరువు నీటనుముంచు పానశాలలకింక
నింతైన ప్రోత్సాహ మీయరాదు
మరి దొంగచాటుగా మద్యమమ్మిన దగా
గానితో చేతులు కలుపరాదు

గుండెనార్పివేసి కొదవలలో ముంచి
పాడుబ్రతుకుదారి బట్టసేయు
గ్లానికిరవు మద్యపానపిశాచమ్ము
భారతమున గానబడగరాదు.

24-6-1978

# మ న వి

రండు తరలిరండు గండాన మునిగిన
తెనుగు ప్రజకు సాయము నొనరింప
మహిత మానవతకు మారుపేరైనట్టి
నెనరు నెఱపు మాననీయులార !

ప్రకృతి మానవునిపయి సవాలు సేసి
ప్రళయభీకర జలధి తరంగములను
రెచ్చగొట్ట తద్ధ్వంసనక్రియల కిపుడు
నా తెలుగుజాతి యేడ్చుచున్నది గనుండు.

తెలుగునేలకెల్ల తిలకమ్ముగా వెల్గి
అంద చందములను చిందినట్టి
దివ్యభూమియైన దివిసీమ కష్టాల
నాదుకొనగ క్షుధల నార్పరండు.

ఇచట వేలమంది మృత్యుఘాటికి నిల్చి
కాలగర్భమందు గలసినారు
బ్రతికి బయటపడ్డవారికి మేల్సేయ
పూనవలయు నిపుడు మానవాళి.

ఆర్తులైనవారి యంతరంగాలలో
హర్ష దీపకాంతి యలరవలెను
సమతపంచిపెట్ట సకలప్రపంచమా !
రమ్ము తెలుగునేల కొమ్మునిలువ.

10-12-1977

## గండికోట

తనబ్రిదుకెల్ల శాంతియుతధర్మపథమ్మున సంచరింప నీ
డ్చినమొనగాడు వేదములరీవికి మూలమ్ములైన గౌరవ
మ్మునకు నిదానమైన బలముంగల విప్రకులావతంసు డౌ
యనఘుడు విశ్వనాథమునకౌత జగా మగరాల సౌఖ్యముల్

శ్రమపడి పైకివచ్చుచు ప్రశస్తి వహింతురు కొంద రిద్దిస
త్యము; మఱికాళ్ళ వ్రేళ్ళబడి యీదురుకొందఱు విశ్వమందుమ
ధ్యమమిది స్వీయసత్కృషికినౌను జయమ్మెప్పుడైన విశ్వనా
థము తగుతారకాణయగు ధర్మము నాతని వెంబడించెడిన్.

ఉపనిషన్మత మహాతపనీయవీథిలో
స్వాంతంబుపొంగార సంచరించి
హర్యాణభాషాకళావాణీమహాత్వ ని
స్తులనిగూఢార్థాల సొబగులెఱిగి

కమనీయ సుకవితాగాంగనిర్ఝరిలోన
నానందమడర గాహనము సలిపి
ప్రతిభావిశేషమ్ము పరికించి ప్రతిభకు
టకటొంకులేని పట్టమ్ముగట్టి

తెలుగుసీమలోన నలుగురినోళ్ళలో
మంచివాడటన్నమాట గలిగి
బెండుపలుకులేని గండికోటకులాబ్ధి
చందిరునకు శుభము లందుగాక !

23-4-1979

## దేశమనగ

కలుషమదోన్మత్త కామాంధచిహ్నమా
మానభంగాల దావానలమ్ము
క్రుద్ధవిద్వేషణ ఘోరపాతకభూత
వర్గాల ఝంఝా ప్రభంజనమ్ము
దుర్వారభయద ప్రోద్ధురమహాదుర్మోహ
ధూర్త లక్షణ కథాదోహదమ్ము
స్నిగ్ధవైశిష్ట్యసంస్కృతిని జీల్చెడి యనై
క్యమహోగ్రదుర్భేద్య కాంస్యభిత్తి
ఈయవస్థలెపుడు మాయమైపోవునో
ఈవ్యవస్థయపుడె యొదిగిపోవు
జనులునాడు దేశమన వచింపగవచ్చు
దేశమనగ జనములే; శబాసు.

ఈ నేలన్ గల మట్టిరేణువులయం దేలాటి తేజోవిశే
షానూనాద్భుత సంపదావళులు నాట్యంబాడి రాణించెనో
కానీ నేటికిచిన్న మెత్తయిన తగ్గంబోవదానిగ్గు దే
శానన్ మృత్తికలోరహించినవి స్వచ్ఛస్వర్ణభాండారముల్.

ఎందున్ ఘోరదురంతదుస్సహ దురూహేచ్ఛాగ్ని
శాంతించి యా
నంద శ్రీనిభృతప్రభూతమగు జ్యోత్స్నా కాంతి దీపించునో
యందెప్డున్ విలసించు నభ్యుదయమాహాత్మ్యంపు జాతీయతా
నందోద్యాన మదచ్చటే జనములున్నారంచు శబ్దించెడిన్.

కలతల్ కషలు కుంటిసాకులు దగాగమ్మత్తు లెచ్చోటట విం
దులు గావింపవో? యందు ప్రత్యణువునందున్ తాండవం
బాడు ను
జ్జ్వలచైతన్యసమగ్రదీధితులు దుస్తంత్రంపు టావేశపున్
కులవర్గమ్ములు మాయుచో నిలుచు నిగ్గుంజగ్గు మైత్రిప్రభల్.

ఈ వాహినీజలంబెల్లప్డు ప్రవహించి
పంటలు పండింపవచ్చుగాక
ఈ హేమఖనిలోన నింతింతయనరాని
స్వర్ణరాశి లభింపవచ్చుగాక
ఈ పరిశ్రమయందు నెంతైన యార్థిక
బలము సంపాదింపవచ్చుగాక
ఈ జ్ఞాననిలయాన నెట్టివిద్యలనైన
బహుకష్టమున నేర్వవచ్చుగాక

కూడుగుడ్డకొఱకు కుమిలిపోయినక్షుధా
వ్యథితులయిన పేదవారి బ్రతుకు
లోన వెలుగు రేకలు మొలకలెత్తిన
దేశవిభవమపుడె తెలియగలదు.

తనువున్ విశ్వహితార్థమైనడుపు మేధావర్గసిద్ధాంత ధో
రణి క్రిందైనశియించుచో నచట దౌర్జన్యమ్ము లైతక్కలా
డును విజ్ఞానకళాప్రసూనములువాడున్ భావిభాగ్యోదయ
మ్మున కాటంకముగల్గి మానవతకున్ పూజ్యమ్ము సిద్ధించెడిన్.

కృతకంబైనటువంటిమోజులకు నంగీకారముల్ సూపి సం
స్కృతికిన్ గొడ్డలిపెట్టుగానిలుచు గస్తీగాండ్రకేనాడు మ
ద్గతు దేశానలభింపదో యచట ప్రత్యగ్రిప్రిభా శ్రీసమం
చితభాగ్యమ్ములు లప్పలై నిలిచి భాసించున్ సమృద్ధంబుగన్.

స్వాతంత్ర్యరథమెక్కి స్వారిసల్పునె ? మహా
మోదాన నీనాడు పేదవాడు
పాలనాదండమ్ము పట్టునే యీనాడు
స్వార్థమ్ములుగని యథార్థవాది

మూడుపూటలు సుంత భుజియించునే నిర్వి
చారాన కవితావిశారదుండు
ఊపిరిపీల్చునే యూరికిదూరాన
పంతాన వెలివేయబడినవాడు

హిందుధరణిలోన నేనాడు సమతా సు
గంధవహుడు తనదు కాలిపెట్టి
పిరికితనము లేక తిరుగునో యానాటి
జనములోయి! దేశమనగ కనగ.

కుతుకముసూపకే వెడలె కొంపలుకూల్చుచు రౌద్రి నేటి దు
ర్మతి యిక నేమిసేయ తలవ్రాయగ నెంచెనో యీయఖండభా
రతము మహాత్ము లాశ్రయవిరాజితగేహము మట్టినే సమం
చితమహాదైక దివ్యనవజీవనధాతువు లాశ్రయించెడిన్.

సతమతమైన జీవితముసల్పి నిరంతరఘోరకష్టపున్
బ్రతుకులనీడ్చి దేశహితభావుకు లాత్మనివేదనాపరి
స్థితి గమనింపలేని దొక దేశమె? యందు వసించు మానవ
ప్రతతికి నెట్టియభ్యుదయవైభవముల్ సమకూరునోకదా !

ఘూకశ్రేణులబోలు నొక్కతరహాగూఢాత్ములైనట్టి యీ
కాకారాయల సింగినాదములకున్ కళ్లెమ్ము గల్పించుచో
ధోకాలేని స్వతంత్రభారతిని నిండున్ శాంతిచాంద్రీ మృదు
శ్రీకాంతుల్ హావణిల్లి దేశమున నౌర్జిత్యమ్ము పెంపొందెడిన్.

విస్తరించిన వర్ణవిషవహ్నికీలమ్ము
లమితవేగాన చల్లారునాడు
వర్గాలపేరిట పదవులిచ్చెడుపద్ధ
తులకు వెంటనె స్వస్తి పలుకునాడు
సంస్కృతిరహితమైసాగు నప్రతిభకు
తోడరుపట్టము గట్టబడనినాడు
కలుషకర్ములైన నిలువుదోపిడిగాండ్ర
యూహలకెపు డుచ్చులొడ్డునాడు

మట్టిలోననున్న మాణిక్యములు నాడు
వెలికి వెడలి కాంతు లలరజేయు
మనుజులన్న దేశమని నాడు క్రొంగ్రొత్త
పాటలను ప్రజాళి పాడుకొనును.

ఆకాశవాణి- 5-4-81

# ప్రశంస

కలతల్ గల్గిన నేటికాలమున వేంకట్రామరెడ్డీంద్రు డు
జ్జ్వలతారుణ్యసుఖైకసంపదలతో భాసించి విద్యాజగ
ద్వలయంబందు నఖండకీర్తి గొని యాంధ్రక్షోణిరాణించి మె
ప్పులకుప్పల్ గొనుగాక! జీవితములో మోదాన నశ్రాంత
మున్.

ఈసర్వాంధ్రిని గడ్డుపాలనముతో నృత్యమ్ముగావించు స
న్న్యాసుల్ శీవినిగూరుచుండుటకు నర్వస్థాన మీరాదటం
చాసక్తిన్ మహదాశయమ్ము హృది యజ్ఞంబై విరాజిల్లగా
నాసాధించిన రెడ్డిచంద్రునకు దీర్ఘారోగ్యసంభావనల్.

ఈభవనమ్ములో తెలుగులెల్లరు నిండుగ మేలుపొందుచున్
గాభరలేని జీవితము గాంతురుగాక! సరస్వతీకటా
క్షాభరణమ్ముదాలిచిన సౌమ్యుడు వేంకటరామరెడ్డిధీ
వైభవమూర్తి కౌత! నిరవద్యమహోన్నతసంపదౌఘముల్.

నిలిపించె తెలుగుభూములు మెచ్చ నొకరెడ్డి
జాతీయభావనా కేతుమాల
పిలిపించె శారదోజ్జ్వలమూర్తి నొకరెడ్డి
భాషాభిమానమ్ము వాసికెక్క
ఝళిపించె నరులు భీతిల చివ్వనొకరెడ్డి
కఱకెక్క వజ్రఖడ్గమును చూపి
వెలయించె ప్రజలు జోతలువెట్ట నొకరెడ్డి
యుత్సాహమున వసంతోత్సవముల

మాటవచ్చిననది యెట్టిపాటిదైన
లెక్కసేయని యున్నతుల్ రెడ్డివరులు
అట్టివంశదీప్తాంశువు కగుత మెలమి
పృథులసుఖము వేంకటరామరెడ్డి కిలను.

తెలుగుల్ మెచ్చిరి మీ హితోక్తులకు నుద్దీపించిరాన్యాయవా
దులుగా నాపయి రాజకీయములలో దూరమ్ముగా లేక మి
క్కిలి దేశోన్నతిగోరినిల్చితిరి వక్రీభూతసంఘమ్ములో
పల మేధావుల యూపిరుల్ నిలిచె మీవల్లన్ నిజంబాడగన్.

ఈశ్వరతుల్యులైన సుకవీశ్వరులన్ గమనించి వారి వి
ద్యాశ్వాసన ప్రవాహములయందున తానము సేసి సత్కళా
విశ్వజనీనభావమును పెంపొనరించిన యో జయప్రదా
ధీశ్వర! యీవిశాలజగతీవలయాన సుఖాలు మీకగున్.

25-11-1980

# చైతన్యవల్లి

ఈ నీసంతతి నీదుపుస్తకను నిన్నిలాగు పూజించి హా ర్షానన్ తేలుచు నీప్రశస్తి జగతిన్ చాటించుటల్ చూడ నీ డా నిండారెడియున్నతిన్ తెలుపు నో యానంద చైతన్యవ ల్లీ! నీ రాజనమందికో తెలుగుతల్లీ! దివ్యధూపావళీ!

దిగ్దిగంతములు వందేమాతరమ్ము ప్రతి
    ధ్వనులీన నాయకుల్ పలుకు వేళ
పొగరువట్టిన యాంగ్లజగదీశ సింహమ్ము
    నెదిరించు మొనగాండ్రు పొదలు వేళ
సకల దేహమును స్వేచ్ఛామాతృ దేవికై
    యర్పించు యువతరం బరుగు వేళ
కఠినదానవశత్రు కల్లోల.శాసన
    జాలమ్ము దేశమున్ చమురు వేళ

వీరభరతజాతి గౌరవమ్మును నిల్ప
నిలిచె స్వేచ్ఛకొఱకు తెలుగువాఁడు
నీతనయుఁడు తల్లి! స్వాతంత్ర్యయుగమున
కతఁడు రత్నదీపమై రహించె.

శ్రీలన్ దోఁచిన హూణులన్ తరుమఁగా జృంభించి స్వాతంత్ర్యపున్
గాలుల్ ధర్మనిబద్ధభారతములోనన్ గ్రమ్ముకొన్నట్టి య
వ్వేళన్ గాంధిపథమ్ము నెంచుకొను నీబిడ్డల్ మహాత్యాగదీ
క్షాలక్ష్యమ్మున సాగ నీకిది ప్రశంసాపత్ర మాంధ్రావనీ!

అలుగున్ పట్టి విరోధిసైన్యముల నూటాడించు నీపుత్త్రు లాం
ధ్రుల శౌర్యోజ్జ్వలరక్తనాళములు కూర్కుం జెంద లేదమ్మ! భూ
వలయంబందున నీమహాప్రతిభకున్ స్వర్ణంపుకంబమ్ములన్
నిలువం బెట్టినవారు తెల్గుదొరసానీ! సత్పురంధ్రీమణీ!

మకరందమొలుకు కమ్మని నీదు బాసకు
కృష్ణరాయఁడు దోయిలించునాఁడు
అనవద్యకవితకు నల ప్రౌఢరాయలు
స్వర్ణాభిషేకమ్ము జరుపునాఁడు

నుడులశక్తికి జోతలిడి సాంపరాయండు
హితముకస్తురి కవి కిచ్చునాడు
ఎలమి తెల్గుపదాల కిబ్రహిమ్కుతుబుషా
సెహబాసని సలాము సేయునాడు

ఎంతస్వేచ్ఛగా హాయిగా నెంతహ్లాద
మెంతగా పొందినావొ మాకిపుడు తెలియు
అసమసుగుణాలమల్లి! యో అమృతవల్లి!
ఘనచరిత్రనుగలయట్టి తెనుగుతల్లి!

సత్యాగ్రహమహోగ్రసమరసారథి గాంధి
ముని మెప్పులంగొనె భోగరాజు
స్వీయవిశ్వంభరా స్వేచ్ఛామహోగ్నికుం
డమ్ములో నుఱికె కొండాకులుండు
నైష్ఠవ్యగాఢభావజ్వాల రగిలించె
ధీరతామూర్తి యల్లూరిరాజు
ప్రతిలేనిశౌర్యమ్ము ప్రకటించి దిశలు ఘూ
ర్ణిల్ల వ్రాసెను గరిమెళ్ళసుకవి

బులుసుసాంబమూర్తి బూర్గులవంశ్యుండు
మాడపాటి నీదు మహితమాన్య
చరితనిలిపినారు స్వాతంత్ర్యయుగములో
అనుపమోజ్జ్వలమణి! తెనుగురాణి!

హూణులధిక్కరించి యురమొడ్డిన కేసరి టంగుటూరి, దే
శానకు స్వీయసీమకు యశస్సులనింపిన దుగ్గిరాల, రా
ష్ట్రానకు నూపిరిచ్చిన యశఃకలితాత్ముడు పొట్టిరాముడున్
మానిని! యింకనెందఱో కుమారులునిల్పిరి నీమహత్వమున్.

ఈ నాస్వతంత్రతా ప్రాణవాయువులకు
తిలకు డాధారుడై నిలుచునపుడు
ఈ నావసుంధర యెనలేని శాంతికి
ఘనుడు పటేల్ చర్య గొనినయపుడు
ఈ నామహాభూమి కెదురులేదని గళ
మెత్తి నేతాజి వచించునపుడు
ఈ నాధరాతలి పృథులవాణి జగాన
నిలబెట్ట జవ్హారు తలచునపుడు

నీమహాంధ్రసుతుల నిర్మలరక్తని
ర్ఝరము లుబుక తెల్లదొరలు బితుకు
మనగ ఆత్మనొడ్డి యసహాయశూరులై
నిలిచినారు సుతులు తెలుగుతల్లి !

జాతీయోద్యమరథ్యలో నిలిచి స్వేచ్ఛావాయువున్ పీల్చగా
స్వాతంత్ర్యంపురణోర్వి దూకిన యహింసామూర్తి బాపూజికిన్
ప్రీతిన్ కూర్చిరి నీతనూభవులు తల్లీ! నీమహౌన్నత్య పౌ
రాతన్యప్రభ లీవసుంధరకు ధర్మక్రాంతి దీపచ్ఛటల్.

జ్వలితపరాక్రమస్ఫురిత జాగృతితో తెలవానిదౌష్ట్యపున్
కలుషముపాఱద్రోలిన యఖండులు నీసుతులెన్నగన్ దిశాం
చలములవ్రాయబడ్డ విలసచ్చరితమ్ముగలట్టి తల్లి! నీ
వెలుగులె యీస్వతంత్రపృథివీభువనానకు జీవధాతువుల్.

ఆంగ్లగంధగజేంద్ర మడలెత్తనెదిరించె
కట్టుగ్రరోషాన కట్టబ్రహ్మ
కుంపిణీ సైన్యాలు గోడుసెందగసేసె
అసమశూరుడు నారయప్పరావు

జనసజీవాంధ్రభాషా పతాకంబెత్తె
గీర్వాణమదరగా గిడుగుపిడుగు
తెలుగుపల్కుల వెలందికి జానుతెనుగులో
శబ్దాలగురజాడ సంతరించె

చితికిపోవువారి బ్రతుకులో నమృతమ్ము
చల్లి జీవితాలు సంస్కరించె
కందుకూరి, వీరలందరు నీగర్భ
ఫలములెగద! యనుగు తెలుగుతల్లి.

1-11-1981

## ప్రత్యభినందన

ఏపావిత్ర్యపు పూజలన్ సలితో నేలాటిధర్మైక దీ
క్షాపుష్పమ్ముల నోచితో తెలియలేనినాడు దీవ్యద్యశో
దీపాలన్ వెలిగించి నాబ్రదుకు నుద్దీపింపగా జేసితో
పాపాంబా! జననీ! లసద్గుణకదంబా! కొమ్ముసాష్టాంగముల్.

నీమొగమెట్టిదో యెఱుగనేరను నేనుజనించువేళ త
ల్లీ! మఱి నామొగంబెఱుగ విప్పటివేళ నదే మొగాని భా
షామధురాక్షరాకృతులు చక్కగనబ్బెను నాకు నీకటా
క్షామలబంధురోజ్జ్వల ప్రశస్తపుదీవనలన్ వచింపగన్.

ఘనతంగాంచిన కాకినాడనగరీ కల్యాణిగాటంపు ప్రే
మనునాకిచ్చిన దోహదమ్మునకు సంభావింతు డెందాన నిం
డినపెంబత్తిని నానమస్సుల కళానిష్ణాతులౌనన్న నీ
దినముల్ నాపి సృజింతుమోహనసుధాదీప్త్యంశు సాహిత్యమున్

వచ్చునా సాక్ష్యమ్ము వచియింపనీనాడు
పుట్టబుట్టిన మహాపుణ్యమూర్తి
తెచ్చునా శిష్యాళి మెచ్చగా నీనాడు
వంశచారిత్రమ్ము వ్యాసమాని
ఇచ్చునా తనజన్మవృత్తాంత మీనాడు
క్షితి మెచ్చగా నూర్వశీసుతుండు
గ్రుచ్చునా కొన్నిపల్కులనైన నీనాడు
తనగూర్చి మాతంగముని విభుండు

ఎవరురారు సాక్ష్యమిచ్చుట కీనాడు
వారు నాకు రక్తబంధుజనులు
చరితలెఱుగువారు సహితమ్ము దీనాడు
దొంగచూపుచూచి తొలగుచుండ్రు.

పున్నెముసేయుచో కలుగుబో సుఖసంపద లోపయిన్ మరీ
పున్నెముచేయుచో కలుగుబో కవితావిభవమ్ము పూర్వపున్
పున్నెముచేతనే కలుగు పుష్కలమైన కవిత్వధార నా
పున్నె మదెట్టిదో తెలియబోను సరస్వతిమాత్ర మబ్బెడిన్.

దొడ్డమనస్సుతో నొరులదుఃఖముచూచి సహింపలేక యా
గడ్డుసమస్యలెల్ల తొలగంగకృషిన్ పొనరించు శ్రీ టి. యం.
రెడ్డికి నీసభాపతికి ప్రీతిమెయిన్ పచరింతు కావ్యపున్
బిడ్డకు మారుగా ప్రణతి విశ్వదిగంతము లుల్లసిల్లగన్.

కులములగోలపోవక దిగుల్ పడుచున్న తెలుంగు కైతకున్
వెలుగులునింపి సత్కవులవృత్తికి పూర్తిసహాయమిచ్చి యీ
తెలుగుచరిత్రలో నిలిచి దిక్కుల కీరితినింపు రెడ్డిరా
జుల తులలేని యాదరపుస్ఫూర్తికి జోతలు వెట్ట నర్హమా.

పెరవారల్ సయితమ్ము మెచ్చుకొనగా వేదాంతమార్తాండ స
ద్బిరుదమ్మున్ గయికొన్న భక్తునకు నీవిశ్వమ్ము సంతోషమున్
నిరతంబున్ హృదిగోరుకొన్న గుణశేకిన్ ప్రేమన్ సమర్పింతు ను
ర్వర గైవారములన్ సభక్తిమెయి కే. రామయ్య డేవిడ్డుకున్.

ఏపగిదిన్ గవిత్వమిపుడెట్టుల నున్నదొ? యేదిసాహితీ
దీపమొ! యేదిగాదొ? యనిదిక్కులు మ్రోయగ జెప్పజాలు సం
దీపితభావనాహృదయదీప్తిగలట్టి యఖండుడైన శ్రీ
కే. పురుషోత్తమాభిధునికీర్తికి బండెడు జోతలయ్యెడిన్.

ప్రామాణ్యంబగు లక్షణాలుగలదివ్యంబైన సత్సాహితీ
సామగ్రిన్ గలయట్టి సత్కవులకాశాజ్యోతిగా వెల్గుచున్
ప్రేమన్ వారిని బల్కరించి పిదపన్ ప్రేరేచుసాయమ్ముతో
నారాధించెడువాని కౌత వతి రామాచారి ధీశాలికిన్.

వాటంబించుక లేనివేళ నను ఫుట్బాలాటలో మీరు నా
యాటన్మెచ్చి మఱొక్కప్రక్క కవితావ్యాసంగమున్మెచ్చి జం
జాటమ్మందున మున్గునాకపుడు ప్రోత్సాహమ్ముగూర్పించి, నా
నాటన్ నాదగు పెంపుగోరిన జి. రామారాయ! కొండాడెదన్,

సరసోదారమహత్వ సాహితికి శంసామార్గసంబంధవై
ఖరికిన్ స్వాగతమిచ్చి మంజుకవితాకావ్యప్రథాసార సుం
దరతన్ మేలిమియైన బంధురతలెన్నన్ మెచ్చుకోజాలు సుం
దరరామా! భువనాననెప్డుమిము వెన్నాడున్ శుభోదర్కముల్

ఆంధ్రవనవాటిబూచిన యట్టి తెలుగు
మల్లెపూలకు నీరమ్ముజల్లి దాని
యభ్యుదయమున కెంతయోహర్ష మందె
దీరు సత్యనారాయణ వీరవల్లి.

తులలేనట్టియశస్సు గాంచితిరి బందోబస్తుగా కావ్యపున్
గుళికల్ తెల్గులకందజేసితిరి యెంతో విశ్వనాథుండు త
మ్ములచందమ్మున మిమ్ముగాంచె నివిగోపూజానమస్కారముల్
పలుకుందొయ్యలి నీవశమ్ము కవిసమ్రాడాభిధా చెప్పగన్.

తెలుగుల పలుకుల వనమున
నలరెను నీయమృతరచన లలరులవోలెన్
నిలిపించిన నీపదములు
లలితలలిత బంధురము "కోలకులూరి ఇనాక్"

ఎలమిన్ పేరునుబడ్డ యీ తెలుగుసాహిత్యమ్ములో నన్నిరీ
తుల జాల్వారిన నీయఖండరచనాదుగ్ధంపు తీయందన
మ్ములసొంపుల్ సకలాంధ్రజాతికి ముదమ్మున్ గూర్చుచున్
ఘన్హిత
మ్ములచెప్పున్ మరిచెప్పుచున్నదిగదా ముప్పొద్దు లీనాక్ బుధా!

నీవైశద్యము శంసనీయము కడున్ నీ భావనా ధోరణీ
శ్రీవైవిధ్యము లేనిదై వెలయు నీసిద్ధాంతమే వేరు నీ
దో వైశిష్ట్యముగల్గునూహ మరిలేరో నీకు నుజ్జీలు, నీ
దే విజ్ఞానపుబాణి తథ్యమిది యద్దేపల్లి రామ్మోహనా!

ముంచెత్తించితి వీమహాంధ్రమున దీప్తుల్ సిమ్మ సాహిత్యపున్
చంచద్భూషణమాలికా ప్రతతి భాషాదేవి తోషింప వా
చించున్ నీదు సమగ్రసత్కృషిని జేజేలమ్మ యాయమ్మ గు
ర్తించెన్ మిమ్ముల నీధరాతలిని స్ఫూర్తి శ్రీ నమోవాకముల్.

భాషాబ్రహ్మవు కవితా
పోషకుడవు పరుషవాక్కు పొడసూపని మేల్
దోషజ్ఞుండవు నానా
భాషాభిజ్ఞుడవు ప్రణతి భాస్కరరాయా!

నాకేమిజరుగుచో నది
నాకే జరుగుననుచును మనంబున నిత్యం
బూకొట్టుచు జేకొట్టుచు
నాకాంక్షించు కవి చిన్మయకు వందనముల్.

చిన్నవయసువాడు చెన్నైనసద్గుణా
లున్నవాడు హృదయమున్నవాడు
పరమమిత్రు డంద్రుపాలున కవ్యేడు
నెల్లవేళలందు పృథులసుఖము.

రామయ్యకు డాక్టరు శ్రీ
రామయ్యకు దొడ్డభావరసరమ్యకళా
ధీమాచాతురి కగుతను
క్షేమశ్రీ భాగ్యభోగకీర్తులు వసుధన్.

సజ్జనుడై కవితాధుని
మజ్జనమునుసల్పి దివ్యమానవతకు సం
పజ్జయమును గోరెదు శ్రీ
ఇజ్జాడకులై కమణికి హితునకు నతులౌ.

ఘనుడగు నప్పరాయదొరగారికి నాకృతినిచ్చినాడ నీ
దినమున చాలసంతసము దిక్కులనిండినకీర్తిగన్న యీ
జనపతి కిట్లొసంగుట నిజానకు తొల్లివిధమ్ముజాటు బం
ధనమిది వృద్ధికావలయు దానికి శారదతోడుగావలెన్.

ఈవర్ణాల మతాల రాపిడికి నాదేకాదు నాజాతిసు
శ్రీవృత్తమ్ము నశించిపోయినది దాక్షిణ్యాత్మ్మలౌదార్యస
ద్భావంబొందు ఘటిల్లుచో మరల పూర్వఖ్యాతి నాజాతికిన్
రావచ్చున్ విషవహ్నిసంభృతవికారక్షోణి కంపింపగన్.

లేవీనాడు కళాసరస్వతికి నుల్లేఖింప సత్కారసం
భావింపుల్ కులవర్గభేదములు సన్మానార్హతల్ పొందుచో
రా వేనాటికి సంస్కృతిప్రగతులీర్ష్యాద్వేషలోకాన ధం
కావాయించి రచింతు మంజులసుధాకావ్యైక కల్హారముల్.

నాయందంతును బొంతులేని యభిమానంబున్ ప్రదర్శించుచున్
సాయంబున్పొనరించి నాకృతికి స్వచ్ఛంబైన స్వాంతమ్ముతో
వేయిన్నూటపదార్లనిచ్చి కవితన్ప్రేమించు రాసిక్యమున్
శ్రీయున్గల్గినవాని నాత్మదలతున్ శ్రీ కే.వి.ఆర్. చౌదరిన్.

ఈకల్లోలజగత్తులో నిజముగానే సత్యవాగ్జానికిన్
నూకల్ పుట్టగ నేరవంచు నెదయందున్ నమ్మి నాకోసమై
వీకానన్ కనకాభిషేకపు సభావిస్ఫూర్తిగొల్పించితో
సౌమ్యమ్మొప్పగ సీయుదారతకు బొజ్జాధర్మరాజా! నమః.

కవితిలకుడు నూతికట్లుకోటయ్యకు
నెడదలోన నెపుడు మృడుని నిలుపు
సరసహృదయునకు విశాలభావోజ్జ్వల
మతికి నగుత ప్రశుభమంగళములు.

కలుగునా జీవింపగా మచ్చునకునైన
ముదమార నాకింత పూరిపాక
వెలుగునా లోకాన కులసమస్యలమధ్య
చేవైన నాకవితావధూటి
చెలగునా దౌర్జన్యములు రేగుచోటను
తేటదనంపు నామాటమంతి
తొలగునా నీడగానిలిచి నన్ వెంటాడు
దృప్యన్మహోక్రుధా ఋణపిశాచి

ఒక్కరసికు డాత్మనూహించుచో పాడు
వడినయట్టి వర్ణవర్గములకు
దూరమయినచో నుదారత వెలయింప
గలడు కవికి నీయగలడు నెలవు.

ఇతడు కళాప్రపూర్ణుడట యెట్టిదొ పొత్తము వ్రాసెనంట యు
న్నతిగల రాచబిడ్డ కృతినందగవచ్చెడినంట శారదా
సతియిట నృత్యమాడునట సందడిహెచ్చనహో! యటంచు ప్రో
న్నత మహదాశయమ్మున గనన్ జనుదెంచిన మీకు
జోతలో.

## సిగ్గుచేటు

అమ్మనుద్ధరింప నంతరంగాలలో
నొకముహూర్త వేళ నూహకలుగ
కొడుకులందు పెద్దకొడుకు,కు నాయూహ
కవునటంచు పలికి రనుజులెల్ల.

అమ్మపేరు లోకమందు విఖ్యాతమై
తనరుటలనుగాంచి తనయులెల్ల
జబ్బచరచుకొనుచు నుబ్బిపోవుచు నమ్మ
ఘనత చాటవలయుననుచు భువికి.

అమ్మ కీర్తిగొనుట యందఱి కిష్టమే
కాని యందఱొకవిధాన నడువ
గా సహింపలేని యీసున్నవారలై
బ్రతుకుచున్నారు కలసిరారు పనికి.

కాని పెద్దకొడుకు కష్టసుఖాలన్న
నెఱుగువాడు హితము జరుపువాడు
కరుణగలుగువాడు గాటంపుదీక్షమై
అమ్మకీర్తిచాట నాత్మదలచి.

ఎంతఖర్చునయిన నేరీతిగానైన
పెట్టవలయు తల్లిపేరు నిలుప
వలయుననుచు పెద్దబాబు వెచ్చింపంగ
ప్రతినబూని వాస్తవమ్మొనర్చె.

అన్ని తెలిసినట్లు లభినయించినయొక్క
ప్రియసహోదరునకు పెద్దజీకము
కట్టబెట్టె తెలియకాతని లోగుట్టు
అమృతహృదయుడైన యన్నగారు.

వందిమాగధులును వ్యవహారదక్షులు
కల్లబొల్లిమాట లల్లువారు
చెక్కభజనపరులుచేర నాతడుగూడ
మఱచిపోయెనన్న మాటమంతి.

అన్న యొక్క సమయమందు నందజులోన
తల్లిప్రతిభజాట తరలు వారి
పేరుపేరువరుస వినిపింప నానాడు
తనివిసెంది రన్నదమ్ములెల్ల.

పేర్లులేనివారు పొర్లిపోయినకోప
జడధి మునిగి చాలగోడవచేసి
చేయి చేసికొనుచు తోయధిదాటినా
రను నినాదమప్పు డావహిల్లె.

సంబరాన సభకు సాగుచుంటిమటంచు
డంబుమీఱగ పయనంబొనర్చి
నట్టివారి యూహ లాకాశహర్మ్యంపు
చందమయ్యె దుఃఖబిందువయ్యె.

తగవులాటలోన తరలినతమ్ములు
దిక్కుకలిగి ప్రస్తుతించినారు
బ్రతుకునెఱుగలేనివారలౌతమ్ములు
తమ యభాగ్యమునకు కుమిలినారు.

అమృతహృదయుడైన అన్న సమీక్షించి
వనటచెందినట్టి యనుజతతికి
ఏదో మేలుసేయనెంచి వాచించెను
వినినవారలెల్ల ప్రీతిజెంద.

కాని యొక్క యనుజు డానిమేషమ్ములో
ప్రాణమున్నయన్న వాక్యములకు
వ్యంగ్యరీతిలోన ప్రవచించె నేనిగూ
డార్థమిందు చోటునందుకొనెనొ?

స్వాగతింపబడిన ప్రతిభాసమగ్రుల
రాకకొఱకు నమ్మ ప్రమదమొప్ప
చూచెగాని కొసకు నోచుకోలేదమ్మ
పుట్లకొలది దుఃఖమున మునింగె.

కులసమస్యలందు కుటిలసంస్కృతియందు
గడనకెక్కినట్టి గడుసువారు
సంస్కృతికి ప్రధానసారథులైనచో
నెగ్గటంచు కొందఱేడ్చినారు.

బాగుబాగటంచు భళిరా! సెబాసంచు
ధ్వజమునెత్తినారు భజనపరులు
తల్లిగుండెలోన భల్లమ్మునాటిన
చందమయ్యె నాటి సంబరమ్ము.

నీతినిష్ఠకలిగి నిర్మల సత్కళా
శారదాంబపూజ సలిపినట్టి
మాననీయుల కవమానమ్ము గల్గించు
వానిబ్రతుకు వసుధవల్లకాడు.

ఈవిషాదవార్త యిట్టెలోకానకు
తెలిసిపోయెననుచు దిగులుసెంది
అమ్మ బెంగపడియె నన్నయు విలపించె
చెప్పికొన్న నిదియు సిగ్గుచేటు.

16-4-1981

## నాజరేతు ప్రభూ!

అస్తవ్యస్తజగన్మహాకలుష మార్గాటుల్ క్రుధాద్వేషపున్
రస్తాపైపయనించుమర్త్యులు నిసర్గప్రేమ చాంద్రీమృదు
శ్రీస్తోమైకపథాననిల్వఁగ దయాసింధూ! కటాక్షింపు మో
క్రీస్తూ! నీజననమ్ము విశ్వభువికిన్ శ్రేయఃప్రథాభాగ్యముల్.

సహనశాంతి కృపాప్రసన్నాంశు దీపాలు
వెలిగింపరా నేడు విశ్వమందు
పొరుగువానినిదోచి భుజియించువానిలో
నిలుపురా నేడు సుస్నిగ్ధమనసు
కులమతమ్ములవల్ల నలిగిపోయిన క్షితిన్
సృష్టింపరా నేడు ప్రేమగంగ
కుటిలజీవనుడైన కుక్షింభరుని యాత్మ
నిండింపురా నేడు నీతిసుధలు

ఆదరింపరా! దురాచారములతోడ
క్రుళ్ళుకుచ్చితంపు కూహకాలు
చోటుచేసికొన్న క్షోణీతలమ్మును
ప్రేమగుణసనాథ! క్రీస్తునాథ!

ఘననక్షత్రమువల్ల నీప్రశుభ సాక్షాత్కారముంబొంది, దీ
వెనలంబొంది ప్రహృష్టమానసముఁతో వేనోళ్ళగీర్తించి య
ర్పణాలన్ జ్ఞానులొసంగినార లలగొల్లల్ నిన్నుదర్శించి వం
దనముల్ సేసిరి నీమహాజననమన్నా! లోకకల్యాణమా!

నింగియు నేలయు మార్మ్రోగ
గంగా దూతాళి హర్షగానము లొలయన్
పొంగిరి భక్తులు, సయితాన్
క్రుంగెను నీపుట్టుకకు త్రిలోకప్రభువా!

నిలువెల్లన్ విషపూరితంబయిన క్షోణిన్ గావ మోసాల జీ
వులకున్ పాఠమునేర్పగాదలచి సంపూర్ణక్షమాదీక్షతో
తొలిపల్కుల్ నెఱవేర్పబుట్టితివి సంతోషమ్ము తండ్రీ! నమ
స్సులు నీజన్మముమాకు పుణ్యములరాశుల్ నాజరేతుప్రభూ!

## క్రిస్మస్

మానిశ్రేష్ఠులు "యెషయా" "యిరిమియా,, మానానన్
ప్రపంచింప ది
వ్యానీకప్రణతుల్ గ్రహించెడు యెహోవానందనా! యేసుక్రీ
స్తూ! నీజన్మము విశ్వభూస్థలికిగూర్చుంగాక యస్తోక ది
వ్యానందోజ్జ్వల శాంతిసౌఖ్యవిభవంబత్యంత మశ్రాంతమున్.

పొడిచెను చుక్కయొక్కటిప్రభూ! వినువీథిని దివ్యకాంతియిం
పడర సమస్తమానవులపాలిటి దిక్కయివారిదోషపున్
జడనిధియింకిపోవగ ప్రశస్వపథమ్మును స్వీకరించి యీ
పుడమిని మర్త్యరూపమునబుట్టిన నీకు గృతజ్ఞతానతుల్.

గొల్లలు నీదుపుట్టుకనుగూరిచి వేల్పులచేత వించు సం
ఫుల్లమనస్కులై నిను ప్రమోదముతోడను పూజసేసినా
రెల్లెడ జాటినార లిదియేసమయాన వియత్పథాన ది
ల్లలితంపుగీతములు పొందుగబాడిరి హర్షమొప్పగన్.

భువనంబుల్ పులకించె భక్తులమనంబుల్ పొంగె జ్ఞానిత్రియం
బవలోకించి యథార్థభావమున నీపాదాలసేవించి నీ
యవతారానకు కారణంబరసి నీకై తెచ్చు నాకానుకలన్
మివులన్ భక్తినొసంగినారలు జగన్నేతా! కటాక్షింపుమీ.

తూలుగాక యనంత దుర్దాంత భయదమౌ
నవలోకపాపసంఘాతఘనము
కూలుగాక జటిలకుటిల దుష్టక్రియా
లోలుండు సైతానుపాలసుండు
వ్రాలుగాక ధరణీభాగాన నెవ్వేళ
శాంతిసంక్షేమ పరిశస్తనిధులు
క్రాలుగాక యమోఘలీలగా దిగ్దిగం
తాల నెయ్యంపు జ్యోత్స్నామరీచి

అలరుగాక మానవాతీతమైనట్టి
దైవశక్తి నిభృతధర్మరూప
మైనఘటన వసుధలోన నీక్రిస్మసు
దినమునందు మరియతనయ! క్రీస్తు!

*    *    *

కలుషాంభోనిధిలో ప్రపంచము నిమగ్నంబై రవం తేని వె
ల్గులజాడన్ గననట్టి వేళ వెలుగున్ గ్రుమ్మింపలోకాన కు
జ్జ్వలపున్ రక్షణభాగ్యమిచ్చుటకునై జన్మించినావయ్యా! నీ
చలువన్ ధాత్రికి మేలుకల్గెను నమస్కారమ్ము క్రీస్తుప్రభూ!

నీ ప్రభాతవేళ నిజముగా మానవ
లోకమునకు మిన్నుల శ్రీకరమ్ము
మృతినినిట్టుగెల్చి లేచివచ్చిన వేళ
క్షితిజనాళికెపుడు జీవనమ్ము.

25-12-1973

## ఎ మ ర్జె న్సీ !

అణగిపోయినది నీ యధికారఘాతాన
కలవాని పెనుకండకావరమ్ము
మునిగిపోయినది నీ ముదలకింపు కతాన
దోపిడీబేహారి దొంగబ్రతుకు
చినిగిపోయినది నీ తీవ్రప్రభావాన
ధనమదాంధుని మేటియినుపపెట్టె
కునికిపోయినది నీ ఘనతరాగమనాన
వెట్టిచాకిరి దాస్యఘట్టనమ్ము
ఏక్షణమ్ములోన నిండియా ఖండాన
స్వారిసలుప బయలుదేరినావో
ఏదో వికాసమిట్టె పొదవె నెమర్జెన్సి!
రమ్మ నీవు స్వాగతమ్ము గొమ్ము.

కల్లోలమ్ములు రేపి యూర్ష్వసవనత్క్ష్మాదేవతా స్వాంతమున్
చిల్లుల్ సేయ ప్రతిజ్ఞగైకొనుచు నిల్చెన్ స్వార్థభూతమ్ము నీ
వాల్లభ్యమ్మున కేడదాగినదో నీ ప్రత్యక్షమిట్లే ప్రవ
రిల్లన్ నిండవె పండువెన్నెల లెమర్జెన్సీ! స్వదేశమ్మునన్.

"రాస్కెల్స్" కొందఱు దేశనాశనము పూరాగోరి సౌభాగ్యశో
భాస్కంధమ్మును ద్రుంపయత్నమొనరింపజూచుచున్నారు మా
దస్కత్ విశ్వవసుంధరాస్థలికి నాదర్శమ్ముగా నుంచ నీ
'రిస్కుల్' వోవగదీకుబూనిన యెమర్జెన్సీ! యివేహారతుల్.

దరియున్ దాపును లేనిజీవులు నిరాధారుల్ దరిద్రుల్ నిరం
తరబాధాక్షుభితాత్ములిప్పుడు మహానందంబుతోడన్ బరా
బరులన్ జేయుచు నున్నవారలిక నీ బ్రహ్మాస్త్రప్రయోగమ్ముని
ద్దురపోగొట్టిన దీ కుతంత్రరచనాధూర్త ప్రజాకోటికిన్.

నకిలీభక్తులుగల్గు హైందవమునన్ శాంతిచ్ఛటల్ మాయ నిం
తకుముందెన్నడు గానిపింపని ప్రశాంతత్వమ్ము చేకూరె నే
డిక నాదేశము విశ్వభూవలయమందెంతో సమార్జించె కీ
ర్తి కృతఘ్నుల్ పెడగొట్టగాదలతు రేతీరున్ ప్రదర్శింతువో.

పోకిరిపిల్లవాడడలిపోయి చరించుచునున్నవాడు నీ
రాకనుగాంచి పేదజనరక్తము ద్రావినవర్తకుండు నీ
ఛాకకు సుండెకొట్టుకొనిడాగెను దుర్జనసంఘఘూకముల్
చీకటిలో తపస్సునకు సేరెను నీగమనంపు ఛాకకున్.

నిలుచున్నారు కృతజ్ఞతాప్రణతులమ్మా! నీకు నర్పింప పే
దలు నీ నీడలలోనగల్గునని స్వాస్థ్యంబింత నీరాకచే
కలిగెన్ చెప్పగరాని యీకదలికల్ గాకున్న నీభారత
స్థలియేమౌనోగదా! దురాత్మకులదౌష్ట్యంబింక ఖండింపుమీ.

బక్కచిక్కినవాని వదనాన నీనాడు
ఆశాకిరణరేఖ లంకురించె
పెనుదాస్యమందు మ్రగ్గినవాని కీనాడు
స్వేచ్ఛగాజీవింప వీలుకలిగె
వెలివాడలందు జీవించువా డీనాడు
బంగారుభూమిలో పాలుగొనియె
అరుసమ్మెలుంగని గిరిజనుం డీనాడు
భాగమ్ముకొఱకు పురోగమించె

నాయకులపదాలు నాట్యమాడినచోట
దళితజాతి తనువు పులకరించె
నీదు జైత్రయాత్ర నిజమెమర్జెన్సి!
యెంతమార్పువచ్చె నింతలోనె.

వెనుకన్ లేనటువంటి క్రొత్తదనమబ్బెన్ నేడు నా 'యిండియా'
ఘనతల్ దిక్కులదాకె నీదగు మహోగ్రంబైన సంచారఘ
ట్టన లీజాతికివన్నెగూర్చినవి క్లిష్టంబైనచేతల్ మహా
త్ముని యాశీస్సులుగల్గు నీవలనసర్ధుంబాటు కాగల్గెడిన్.

కడచినదొక్కవత్సరముగాని యుగాలయుగాలనుండి యే
ర్పడిన దగాచరిత్రగలవారల దర్పమణంచి శాంతిచం
ద్రుడు నవభారతాభ్రమున తోరపుకాంతులు సిమ్మునట్టులే
ర్పడనొనరించు నాత్యయికభార్గవి! నీకు నిసర్గహారతుల్.

నిలుపుమీ దేశాన నిఖిలసర్వసంహ
　　　కోనియాడు గుజరాతు మునివచస్సు
కలుపుమీ కలుషవర్గాలనన్నిటి నొకే
　　　యభివృద్ధి పథమునం దడుగువేయ
దులుపుమీ కొంగభక్తులుసేయు దౌర్జన్య
　　　కాండోద్ధతుల కూహకాలబూజు
మలుపుమీ ప్రజలసమత్వభావోజ్జ్వల
　　　భవితవ్య చైతన్యపథమువైపు

ఈవు దండమూని మేడాదిలోపల
క్రొత్తదనపు కాంతిగూర్చినావు
తొలుతలేని శాంతికలిగె నెమర్జెన్సి!
దేశమునకు నేడు దివ్యదీప్తి.

ఆకాశవాణి 26-6-1976

# భువన విజయము

## (కాకినాడలో)

సమస్య : "భార్య లిద్దరు శ్రీరామభద్రునకును"

పూరణము :

సకలకళ్యాణగుణధామ! సాధ్వియైన
సీతగూరిచి నీతోఁడ చెప్పినట్టి
దుష్క్రియావేశపరుడైన దూషకునకు
భార్య లిద్దరు శ్రీరామ! "భద్రు"నకును.

దత్తపది :

జ్ఞానానందము
స్నానానందము
గానానందము
మౌనానందము.

సదస్యపరముగా పూరణము :

జ్ఞానానందముతోడ నీదృశసుధాసాహిత్యపాథోధిలో
స్స్నానానందముసంతరించుకొని విశ్వంబెల్ల నగ్గింపమేల్
గానానందములో దనూలతలు పుల్కల్
రేగ తోషించు మీ
ధ్యానానందము మూడుకాలములు సంభావ్యమ్ము
చర్చింపగన్.

V. R. NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D. P. R. I.
Acc. No.
10410

భారతపరముగా :

జ్ఞానానందముకల్గుపాండవులకున్ సామ్రాజ్యలక్ష్మీయశ
స్స్నానానందముగూర్చె శౌరి; వెను వెంటన్ గాయనీ
గాయకుల్
గానానందముపంచిపెట్టగ సభాగారమ్ములో సభ్యులున్
ధ్యానానందము పారవశ్యమున సంభావించిరత్యాదృతిన్.

## ఆశాసనము

తన కారుణ్యకటాక్షవీక్షణలతో ధాత్రీస్థలిం గాంచి గౌ
రిని గంగన్ ముదమారసందడులతో రేలున్ బవళ్లున్ దయా
ధనియై కూరిమి జూపు నీశ్వరుడు నిత్యంబున్ గటాక్షించు స
జ్జనశంసార్హుని ధర్మభావుకుని భోజ్జ ధర్మరాజాభిధున్.

V.R. NARLA D.P.R.L.

కళకానందము గూర్చి తత్కళకుపకారద్రవ్యసాహాయ్యముల్
సలుపన్ బూని కళాభిమానమును విన్నాణమ్ము గాజూపు నీ
తెలుగుం దేశము మెచ్చుకోదగిన కల్తిలేని స్వాంతున్ విని
శ్చలసౌభాగ్యములాశ్రయించెడిని భోజ్జాధర్మరాజాఖ్యునిన్.

ఎవనికళాదృష్టి ప్రవిమలభావాన
నలఘుసత్కవి హైమజలధి దేలె
ఎవనిసమ్యగ్దృష్టి కెంతేని హరిదాసు
తనివార పసిడికంకణము దాల్చె

ఎవనివాక్కుకతాన నెల్లప్పు డొదవెను
గాయకోత్తమునకు సాయమొండు
ఎవనిసంకల్పమ్ము దృఢమైనబంధమై
వేదాంతికి పరసువేది యయ్యె

అట్టి బొజ్జాకులాబ్ధిసుధాంశుడైన
ధర్మరాజుసార్థకనామధారి యింట
కాపురముసేయుగావుత కంధిపుత్రి
ఆయురారోగ్యభోగభాగ్యము లొసంగి.

అనుకొనుచో నదెంతపని యర్జుననందనుడైన ధర్మరా
జునకు రసజ్ఞభావునకు సూరులు శూరులు మెచ్చుకొన్న ధీ
ఖనికి వదాన్యచిత్తునకు కమ్మనికైతకు దోయిలించుటల్
కనకజలాలముంచుటలు గౌరవమొప్పగ సత్కరించుటల్.

26-1-1975

## ఉపదేశవః౨

అదిగో! యాతని కేమి కావలెను నీకై యంత త్యాగమ్ము స
ల్పి దివిన్ వీడగ; ఔను కావలెను విశ్వశ్రేణి పాపాంధకా
ర దురాక్రాంతదురంతశోకమయి మూల్గన్ తానె రక్షింపవ
చ్చె దయాసింధువతండు వానిపదముల్ సేవింపరా! భక్తిమై.

ఇదిగో! యెవ్వడవీవు నీ బ్రతుకు గొప్పేమింత నీజీవితా
భ్యుదయం బెన్నదియేండ్లుగాదె! యిక నేమో లోకభోగాలపై
మదినిల్పన్ కడుసంతసింతువు కృపామాన్యుండు శ్రీక్రీస్తుని
న్నుదరిం జేర్పగ బిల్చుచుండిన గతిన్ జూడంగరా! భక్తిమై.

అడుగో! నీయటువంటివారికొఱకై యాత్మార్పణం బియ్య దే
వుడు తానేదిగివచ్చె ధారుణికి సంపూర్ణాభిమానమ్ముతోన్
గొడుకున్ రూపముగా మహోన్నతుడు నిన్నుం గావగా నీజగా
కడిమిన్ గల్మి నివీడి సిల్వశ్రమలన్ గామింపరా! భక్తిమై.

జడియకు క్రీస్తునాథుడు ప్రసన్నుడు నీదుసమస్త దేహమున్
పుడమి యనంతరంబ తనపోలికగాగ సృజించెసృష్టికిన్
యొడయుడువాని పక్షములహో! సువిశాలములైతనర్చు నీ
పిడికెడుముద్దకై చటులవేదనబొందకురా! సభక్తిమై.

జీవాహార మతండొసంగునని తాజెప్పెన్ సమస్తప్రజా
భావా లాతడెఱుంగు రక్షణ మహాభాగ్యంబు నీకియ్యగా
స్లీవన్ మోసె నదృష్టవంతుడవు నీసిల్వన్ భరించెన్ ప్రభుం
డీవైనంబునెఱుంగకుండెదవె యబ్బి! రా! ప్రభుంజేరగన్.

బాధలతో ప్రయాసపడి భారముమోయుచునున్నవారి పెన్
గాథలవించు నాతడొడికమ్మనగాచు నటంచెఱింగియున్
ఈధర మిన్నకుండెదవదేల? దయానిధి! మోక్షరాజ్యపున్
నాథుడు నీవువానిచరణమ్ములు గొల్వగరమ్ము దీక్షమై.

అడుగుడి మీకు నీయబడు నర్మిలితో శుభసంచయమ్ములన్
కడగిననాసతోడ వెదుకన్ దొరకున్ తమిగోరువస్తువుల్
తడయక మొఱ్ఱపెట్టుకొని తట్టుముతీయబడున్ వెసన్ గృపా
జడనిధి క్రీస్తుమార్గమున చయ్యననేగగ రా! సభక్తిమై.

నిన్నుంబోలిన నీసహోదరులనుం బ్రేమించి విశ్వైకభా
వౌన్నత్యంబును పెంపుజేసికొనగా సత్రశాంతమున్ శ్రద్ధమై
అన్నా! నీవు పరిశ్రమింపవలె దివ్యాధ్యక్షుఁడైనట్టి యే
సన్నన్ నీవు భజింప శీఘ్రగతిరారా! పూర్ణసద్భక్తిమై.

ఎవడనగల్గు మోక్షమున కేనెపథమ్మనుపల్కెలీ మహా
భువనభవంతిలోపల ప్రభుండనగల్గెను పంచభూతముల్
వివరణ సేయునాతని ప్రవీణతలన్ జగదేకనాథుఁడై
ప్రవిమలుఁడై వెలుంగుభగవానుడు వానిని గొల్వరా బడిన్.

ప్రమదముగొల్పదాతని పరమ్ముపథమ్ము జనమ్ము మెచ్చలే
ని మహిమగల్గువాడు ధరణీవలయానకు రక్షకుండు దీ
నమనసుగల్గు దేవుడు సనాతనుడాతడు దిక్కులేని వా
రి మతులగాంచు ధీకులవరేణ్యుడు నాతని గొల్వరా వెసన్.

గాటపుతప్పుచీకటులగానక దుర్గతి జెందువారికిన్
బాటపడన్ స్వరూపమును తెల్లముగావచియించె దేవతా
కోటికధీశ్వరుండయిన 'గొల్గొత' నెక్కిన క్రీస్తురాజు నీ
కూటికి నీ చిరాయువునకున్ దగుకర్జమురా! సహోదరా !

చూడుము దివ్యనేత్రముల శుంభదఖండమహాప్రతాపకుం
డీడనె యున్నవాడతని సృష్టివి నీవ; యదొక్క గొప్పయే?
ఆడగ; నంతవాడు నిను నాదరమై కరుణించికావగా
వేడవదేల? యేల యవివేకముపీడవురా! సభక్తిమై

నినుగని నీవు మోసమను నిద్దురలోనమునింగినావు నిం
గని భగవంతుడైన ప్రభుకల్వారి మోసెను సిల్వనెందుకో ?
మనమునప్రశ్నవేసి యనుమానముదీరుచుకో ప్రశస్తజీ
వనమును నిల్పుకో పరమపావనుజేరగరా సభక్తిమై

చిరముగ క్రీస్తునాథుడిల జీవనగానము మానవాళికిన్
అరయగ నేసునాథుడిల నందఱకున్ గడుదివ్యదానమై
పరగెను వానిగానముల వానికృపాకలనా నిదానదా
నరమకు లోకమంతయు ప్రణామము సేయునురా! సభక్తిమై

ఏమిభుజింతుమో? మఱియు నేమిధరించెదమో? తలంపగన్
ఏమిజగాన త్రాగుదుమొ? యెట్లులనీతను వెల్ల సాగునం
చేమియు చింతనొందకుము యేసునిప్రేమరసైక వీక్షణ
స్తోమము నీకు క్షేమమునుజూపును నిచ్చలురార! భక్తితో

కాననసీమలో మొలిచికండ్లకు పర్వముగూర్చునట్టి యం
దానసెలంగు గడ్డిపువు తథ్యమువాడును చెప్పగా 'సొలో
మోను'కు గూడలేదువిభవోన్నతి నీవదియెంత కావునన్
దీనమనస్సుతోడ ఘనదేవునియొద్దకురార భక్తిమై

కుంచముక్రిందగాని కనుగొన్నను మంచముక్రిందగాని జీ
వించెడుమానవుండెవుడు పెట్టడు దివ్వెను పైనిగాక నీ
యంచితసద్గుణమ్ముల ప్రజావళి కాంచుట యుక్తమౌను నిన్
గాంచిన క్రీస్తునాథుపదకంజములన్ భజియింపరా ధృతిన్

ఎంతటిసూక్ష్మపద్ధతిని యీవ్యభిచారముగూర్చి చెప్పె వే
దాంతుల యూహకుంబోడమనట్టి వినూతనమాతలంపు సి
ద్ధాంతముగొప్పదై వెలయు ధర్మముకోసముపుట్టినట్టి యీ
శాంతుని క్రీస్తునాథుని ప్రశస్తినిజాటగరార భక్తిమై

అనుకొనుచుందువేమొ? మరియేసుతుడేమిటి లెక్క-యంచు నీ
మనమునచాల జాగ్రత! సమస్తజగత్తుననున్నవెల్ల నా
యనివిసుమీ! ప్రపంచమున కాయనదేవుడు ముక్తినీయ నా
తనికధికారమున్నది, యుదారుడు నాతనిగొల్వరా వెసన్.

1-11-1964

## ప్రథమ వర్ధంతి

ఇల్లిట లేనివానివలె నేగితి వెచ్చటకో యి? యింతలో
వెళ్ళినదొక్కయే డెదల పిండుచునిక్కము సెప్పుకొన్నచో
కల్ల లెఱుంగ నేరని యొకానొకపూర్వ మహర్షివీవు నీ
వల్ల ప్రచారమయ్యె నుడువన్ మహనీయపుటార్షధర్మముల్

ఎగ్గుల్ వల్కుచు హైన్యశబ్దములతో నింపొందుసాహిత్యపున్
నిగ్గుంజూపనటించు దేబెలకు గుండెల్ వ్రీలె నీవాక్కులో
మ్రుగ్గుల్వెట్టె ననంత సంస్కృతకళాంభోజాక్షి నీయూహకున్
నిగ్గుల్ గూర్చుచునున్నవారిపుడు నీనెయ్యుల్ యశోభూషితుల్

విమతుల్ గూడ మనుష్యులేయనుచు విద్వేషమ్ముసూపింపక
చ్ఛముగావారల నాదరించితివి యార్షబ్రాహ్మణోత్తంస! యు
త్తమమానీగుణపుంజముల్ జగతికాదర్శమ్ముగా ధర్మమా
ర్గముగా వెల్గుత! పూరుషోత్తమ! యథార్థంబిద్ది ముమ్మాటికిన్

గంభీరంబగు నీవచోరమణికిన్ గారుణ్యచిత్తానకున్
శుంభద్దివ్యదఖండప్రజ్ఞకు నమస్సుల్ సల్పి నా రీప్రజల్
దంభంబింతయు లేని నీబుజుతసందర్శించు నెల్లప్పుడా
శంభుస్వామికృపాపదాంబుజరజస్సౌభాగ్యసమ్మోదముల్

తిరుగాడుచున్నది యరుసాన శిరమెత్తి
నీనేర్పుగనిన గీర్వాణవాణి
సడలించుకొన్నది జగతిలో నీమంత్ర
ముననార్షధర్మంపు ముద్దరాలు
అలవర్చుకొన్నది చెలిమిని నీబోధ
వలన పురాద్వేష పద్మనేత్ర
సాధించుకొన్నది సమత నీ మెదగని
కుటిలసంఘద్రోహాకువలయాక్షి

మంచికే నీవు సతము శ్రమించినావు
ఎరుకకే నీవు తనువు వ్యయించినావు
ఋషిపురాధర్మమును ప్రబోధించినావు
అమలచరితంబుగలుగు బ్రాహ్మణుడ వీవు.

అసిధారావ్రతమయ్యె నీదయినలక్ష్యంబింత యద్దానికే
యుసురుల్ పూర్తిగఖర్చుపెట్టితివి నేడూరూరవెల్గొందు నా
ర్షసమాలీఢపు భావనాకిరణకింజల్కాలు మేల్కాల్పు ల
భ్యసనీయంబులు "పూరుషోత్తమ" భవత్ప్రాగ్భార
వైదుష్యముల్

తిలకింపగానీవు నిలుచున్నచోటులో
నగుపింపదెపు డసత్యాలరాణి
పరికింపగానీవు భాషించువేళలో
రాదొకనా డపభ్రంశవాక్కు
గుఱుతింపగానీవు చరణమూనిన ధరా
వలయాన చొఱదుడంబముల పడతి
ప్రశ్నింపగా నీవు పయనించు సేలలో
వాసింపదల గ్రామ్యవాగ్వధూటి

నీదు పేరుసెప్ప నిలువనేరదు నవ్య
నాగరకతగలుగు నాట్యభామ
నీవు ధన్యుడవు "జటావల్లభుల పురు
షోత్తమా!" ధరాసురోన్నతుండ!

నీరాకంగని కాళిదాసప్రభృతుల్ నెమ్మిన్ ప్రపూజించి నా
రా! రావయ్యమహానుభావయని యారాధించినారా! కళా
సారజ్ఞుల్ ఘనులాంధ్రసత్కవులు, మోక్షాధ్యక్షుఁడానందమున్
ఫూరాస్వాగతమిచ్చెనా? సురలునిన్నున్ భక్తిగొండాడిరే?

22-10-1973.

# హెచ్చరిక

ఈ జాహ్నవీనదీ తేజోంబురాశికి
నురువుసంపచ్ఛక్తి యున్న నేమి
ఈ రమ్యమైన కోలారుభూములలోన
నెన్ని స్వర్ణపునిధు లున్న నేమి
ఈ జలరాశిపై నెల్లప్డు పొగయోడ
లెన్నేని తిరుగాడుచున్న నేమి
ఈ పుణ్యధారుణి నెసలార నెన్నెన్ని
పృథుల తీర్థా లావహించె నేమి

పెరుగుచున్న జనత యరికట్టబడనిచో
గానబడదు సుంతయైన ఫలిత
మేవిధాననైన నీకుటుంబ నియంత్ర
ణమ్ము భావిభరతనందనమ్మ

ఒకరో; యిద్దఱో! బిడ్డ లాగృహమునందున్నన్ యథార్థా
నకున్
సుకముల్ సేకురు నిండుగానచట, పస్తుల్ బాధలచోట్చట నుం
డక దూరానకు పర్వులెత్తి చను, నింటన్ హర్షచాంద్రీస్ఫుట
ప్రకరమ్ముల్ తయితక్క-లాడు, శుభముల్ ప్రాపించు
నశ్రాంతమున్

ఒకసన్న్యాసి నికృష్టపుంబనికి సద్యోగర్భముందాల్చె నొ
క్క కుమారీమణి వేఱొకర్తుకనియెన్ కామాంధుడైనట్టి యిం
కొకసన్న్యాసికి వీరిసంతుతలు నేడూరూరనున్నార లీ
వికృతాచారము నిల్పజాలినయెడన్ వెన్నాడు సౌభాగ్యముల్

గం పెడుపిల్లలున్నయిలు కమ్మనిస్వర్గముగా వెలింగి నై
లింపుల యాశిపాలనవలీలగనొన్నది పూర్వమందు రా
ణింపురహింప నిప్పు డవినీతిపథానకు తిండితిప్పకున్
కంపము రేపె దిద్దుకొనగా వలెనేటికి నాటిపద్ధతుల్.

వస్తుగకల్మిగల్గునొక మానిసి బిడ్డలులేనివాడగున్
పస్తులువడ్డపేదకు నభాగ్యునకున్ కడలేనిసంతు వి
ధ్వస్తముజేయుకాపురము దమ్ములులేనటువంటి జీవితా
భ్యస్తము లీక్షితిన్ నరకయాతనలై దహియింపజేసెడిన్

నిరతమ్ము పార్వతీ నీరజాక్షి దనించు
వృషభవాహను సుతులెంతమంది
కడలిపై కాంతతో కౌగిలింతల దేలు
వెన్నునికెందఱు బిడ్డలరయ
రాగరంజిత కళారమ్యవీథుల సర
స్వతిదేల్చు బ్రహ్మకెవ్వారు సుతులు
గరళకంఠుని విల్లువిఱచిసీతను గొన్న
రామయ్యకెందఱు ప్రభవమయిరి

సృష్టికారాధ్యులైన వీరే! నిజాన
కెక్కువగ బిడ్డలనుగన కీప్రపంచ
క్షేమమున్ గోరి సంతు తగ్గించినారు
ఆర్షభారతమున కుదాహరణ మిదియ

శాంతిని సంహరించి యపచారము మూటనుగట్టి కర్మసి
ద్ధాంతముదోపిడీసలిపి దైన్యతమోజలరాశి ముంచె వే
దాంతము పేరుసెప్పి భరతావని నిచ్చట స్వార్థఘాతముల్
గంతులువైచుచుండు గనగాసుఖరాశులు జాలువాఱునే?

సంతతికోసమ్ము చదువు సంధ్యలకు నే
గాని యార్జన చేయలేని నాడు
అర్ధాంగి హృదయాన నసియాడు కోర్కె సుం
తైన దీర్పగజాల లేనినాడు
సంసారజలధిలో సతమత మూచు కా
పురము భారముచేత పొగులునాడు
బడుగు పేదతనాన బ్రదుకులో హర్షమ్ము
కొంచెమైనను చూఱగొననినాడు

సంతుకొఱకు నాసజూపడు నొక్కడు
న్ననుసరే! మెడంద తనియునాడు
హద్దులేని సుఖములానాడు గృహములో
నిండుపర్వమట్లు తాండవించు

వ్రణమైపోయిన దీ ధరిత్రికి జనాభా లెక్క యీనాడు హె
చ్చినమూలమ్మున భాగ్యసంతతికి విచ్ఛేదమ్మురానీక ప
చ్చని సంసారము సేయుభారతము ప్రస్థానింపగా నీ నియం
త్రణ మంత్రమ్మిటనుండి తీరవలెనెన్నాళ్ళైన నన్నాళ్ళకున్

# హెచ్చరిక

ఈ 'వేసక్టమి' యీ 'ట్యూబెక్టమి' లచే నీసంతుతగ్గించుటే
ఈవేళన్ సరియైనమార్గమగు లేదేలాటి మార్గమ్ము ముం
దీవై నమ్మును ప్రోత్సహింపవలెన శ్లేయైన నీభారత
శ్రీవృత్తాంతము దిగ్దిగంతముల వాసింగాంచు ముమ్మాటికిన్

వలరాజు కోఱచూపుల పిసాళింపుల
కగ్గమ్మగుట దోషమన్ననాడు
అనయమ్ము కామశాస్త్రాభ్యాస సంగతుల్
తప్పించు నెడదకు తెలియునాడు
సమయాసమయముల గమనించుచున్ సతీ
పరిచుంబనమ్మును మఱచునాడు
తలపు మిక్కిలి వినిర్మలమయి చెఱుగును
వేయిమైళ్ళకు ద్రోసివేయునాడు

పూలబాణాల వాడెంత మొత్తుకొన్న
వేయికండ్లున్న వాడెంత త్రోయుచున్న
జాతిజనవృద్ధి నరికట్టు సాధనమ్ము
కలదె? యింతకంటెను మఱొక్కటి తలంప.

16-3-1978

# తుఫాను

ఒకనెలలోనె యింతటిమహోద్ధతిమై చనుదెంచి యాంధ్రభూ
మికి నెనలేని నష్టమును మిక్కిలిగూర్చిన యో తుఫాను! నీ
దొక బ్రతుకేనటే! తెలుగులున్నతికిన్ కనుగుట్టైనే? కిరా
తకమగు నీచరిత్రకు నుదాహరణంబిదిగాదె వాకొనన్

నీకుంబిల్లలుజెల్లలున్ గలుగరే? నీమూర్ఖతాకార్యముల్
లోకగ్లానికి కారణంబగు సమాలోకింపగా నీవు నీ
పోకీళ్ళున్ విడనాడి విశ్వమునకున్ పొందించుమానందచాం
ద్రీకమ్రైక్య మరీచిపుంజములు సందేహమ్ము లేకుండగన్

ఇవిగో! నీపెనుగాలిధాటికి కుజాలెంతంతగానూగుచు
న్నవో యెన్నెన్నిమహీజముల్ విరిగి క్రిందంబడ్డవో యెన్నిమా
నవదేహాలు నశించెనో ప్రళయసంధ్యాదేవి నీరూపమై
యవతారించి సమస్తనాశనము చేయంజాలెనో తెల్పగన్

గుడిసెలుకూలిపోయినవి కూటికిగుడ్డకు వాచిపోవు నీ
బడుగులు పేదవారలకు వాసముసేయగ చోటులేదు నీ
యడుగులచప్పుడున్ విని నిరాశకులోనయినారు వారలెం
దడుగిడువారు ? నీదుప్రళయార్భటివారలగుండె జీల్చెడిన్

పండినవంటచేలులును పండుచునున్నటువంటి చేలులున్
నిండుగ ముంచివైచితివి నీవు దురాగ్రహబుద్ధిచేత మా
గుండెలు బెండువోవ నిదిగో పెనుఝుంఝుగవచ్చి తెన్నులన్
చెండితి వేమిపాముకొనిచేసెదో ? మొండితుఫాను రాక్షసీ !

17-11-1976

## అ ర ణ పు గో ల

సొమ్ముల్ దండిగ కల్గి కప్పములరాసుల్ గొన్నవాడెప్డు ద్ర
వ్యమ్మున్ గ్రుమ్మెనుజోరుగా సుతకునుద్వాహమ్ముగావింప ని
ష్ఠమ్మర్యాదలుసాగలేని స్థితులధ్యానమ్ము గల్పించి జీ
వమ్మున్ నాశమొనర్పబూనుట సహింపన్ లేని దుశ్చర్య యా

గొప్పదనమ్ములోకమునకున్ గనిపింపగ జేయనాసతో
నొప్పినరీతి వైభవములొప్పినరీతి వ్యయింపజేసి పెన్
ముప్పునుదెచ్చుకొన్న విషపున్ ఘడియల్ ఘనమానవత్వమున్
చప్పున జుట్టినట్టి యరణమ్ము విధానము ద్రస్తరించెదన్

రమణుల్ నిత్యమునార్తి జెందగ కఠోరక్రూరశాపంపు చ
ట్టములన్ జేసిన వానినైచ్యగుణఘట్టాలెట్టివో యీ సమా
జముగు ర్తించుట మేలు లేనియెడ దౌష్ట్యంబెప్డు హెచ్చై యమాం
శముగా పీలిచిపిప్పి జేసెడిని వర్ణద్వేషఖండమ్మునన్

ఇలపయి భారవాహమగు నీవరశుల్కము పెద్దమచ్చగా
నిలిచినదార్షసంస్కృతికి నిక్కము దీనిని రూపుమాపి క
న్యల మధురైకజీవితములందు మహోజ్జ్వల హర్షచంద్రికా
వళి ప్రసరించులాగున ప్రవర్తిల జేయుట మానవత్వమా

సహగమనమ్ము బాహువులుచాచి కవుంగి లో నిముడ్చుచున్
మహిళలనేడిపించిన యమానుషఘట్టములన్ స్మరింపగన్
సహనము దానిదారి నది నక్కినదెక్కడో? నేటికట్నపున్
దహనమునందు గాలవలె దగ్ధమ లీవరశుల్క తోషితుల్

ప్రేమంజూపుచు పెండ్లిసేసికొన ప్రేరేపించువాడే ధన
వ్యామోహమ్మున పెండ్లిమానుకొన నీపైశాచికీచర్యకే
దీ? మం.నీక పటంపు సంఘమున నెప్డీదుష్టసిద్ధాంత వాం
ఛామాలిన్యము మంటలంబడునో హర్షంబప్డు స్త్రీజాతికిన్

ఎందుకు ప్రేమసూపినటియించుట యెందుల కీ సరాగపున్
గందముపూయనెంచుట వికారమదెందుకు తియ్యనైన యీ
చందముదాటి కట్నములసాకున కన్యలగుండెలందు శా
పేంధన విస్ఫులింగముల నెందుకు జిమ్మట సిగ్గుచేటగున్

మనసారగానమ్ముకోని జీవితము సేయ
            నభిలషించిన కోమలాంగి బ్రతుకు
బ్రతుకులో స్వర్గాలుపండించుకోన నెంచి
            యుబలాటపడునట్టి యువిదమనసు
సుమనోజ్ఞముగ సుఖస్తోమధునీ డోల
            డేలగావాంఛించు బేలతపము
పరువంపుస్వాంతాన స్వారిచేసెడు కోర్కె
            నెఱవేర్చుకోగ కన్నియతలంపు

గాలిడేలజేయ కట్నాల శాపాల
పేరుతోడ నవ్యభారతమున
ఈ కుసంస్కృతికి మఱెప్పుడు స్వస్తి వా
చకమొ? నాడు స్త్రీకి సంబరమ్మొ

ఈకట్నాల యగాధవారిధిని పెన్మృత్యు ప్రహారాలకున్
శోకంబందున గ్రుంగునంగనలకున్ చోటెంతజీవింపగా
లేకున్నన్ భువి; నింకిపోవునుసుమీ! పృథ్వీన్ సుసంస్కార పూ
జాకల్యాణము మత్తకాశినుల యాశల్ పూచి పుష్పించుతన్

తరముల్ పెక్కు-గతించుచున్నను యథార్థంబున్ వచింపన్ సమా
దరమున్ భర్తలచేతబొందని నిరాధారల్ గలారెందఱో
దురితంబా యరణాన నెవ్వా లలనాదుఃఖాశ్రుధారాపరం
పర లీస్వార్థజనాళిగుండెల దహింపంజేయు దావాగ్నియై

గుణీతప్పుగావుత గరితపై నేసిన
మగవాని వరశుల్క- మార్గణమ్ము
స్తంభించుగాత హింసాపూరితంబైన
ప్రమద నేడ్పించు కట్నములగొడవ
నిలుచుగావుత మిలాతలి స్త్రీధనమ్ముతో
బ్రతుకు పూరుషుని స్వార్థంపుబుద్ధి
అణగారుగావుత పెనుమచ్చగా గనం
బడెడు కట్నంపు బ్రిమ్మరులపొగరు

ఒక మహోర్మికవలె నొక మహోత్తుంగ శృం
గమ్మువలెను నేటికాలమందు
యువతనిలుచుచో మహోజ్జ్వల చైతన్య
మింపెసంగనిండు నీధరిత్రి

—ఆకాశవాణి

# స్వాతంత్ర్య సందేశము

మతిగలమానభంజకులు మందులగాండ్రు చరించుభూమి సం
స్కృతి కెటు లాకరంబగు వచింపగ సిగ్గునుచేటుగాక దు
స్థితి పెనుభూతమై కెరలి చీల్చును దేశసమైక్యమున్ మహో
న్నతకృషి కీవిధానములు నాశనమార్గములై కనంబడున్

బదవుల్ బన్నములన్ సహించి భరతాంబా స్వేచ్ఛసాధించియ
మ్ముదివగ్గైన మహాత్మగాంధి నుడికిన్ మోదమ్ము గల్పించి యా
పదపాలైన స్వతంత్రతారమకు విశ్వక్షోణిలో గీర్తి పెం
పొదవంజేసిన త్యాగమూర్తులతలంపుల్ నేడు ప్రేరేచెడిన్

రోదగామారిన యీకులాల్ వలన నారోగ్యమ్ము క్షీణించుచు
న్నది వేదాలధరాతలమ్మునకు, సన్న్యాసుల్ ప్రవర్తిల్లుచో
టిది, యే మందులు మాకులున్ పడవు, లే వేలాటి
వారోగ్యసం
పదకున్ తావగు నౌషధమ్ములు; కులధ్వంసమ్ము హర్షంబగున్

కులతంత్రమ్ములు పెచ్చుమీరెను ధరాగ్నుల్ జాతిజీవాలకే
అలుగవ్యోన్ నిదురించుజాతి కిక లేవా? జీవనోజ్జీవరే
ఖలు స్వాతంత్ర్యము, పారతంత్ర్యమును ముక్కల్ ముక్కలంజేసి పే
దల కండై నిలుచున్నచో నచట స్వాతంత్ర్యమ్ము సిద్ధించెడిన్

అంచెలువారిగా బ్రతుకులందు ప్రయాణముసేయుచున్న యీ
లంచపునంగనాచికి, సలామొనరించెదు కర్మమబ్బె దు
ర్వాంఛల కాసపడ్డ పరిపాలకుడెప్డు ప్రజాహితైషియై
మంచిని సేయునో యపుడెమంగళముల్ సమకూరు నచ్చటన్

గొప్పల్ సెప్పుచు దొమ్మసూపుచును బుక్కుల్ నోట
వల్లించుచున్
గప్పాల్ గొట్టెడివాండ్రు నింకను ఘరానావంచకుల్
ద్రోహులున్
తప్పొప్పుల్ గమనింపనట్టి కుజనుల్ తారాడు దేశానకున్
తిప్పల్ దప్పవు వేయిసార్లయిన నా దేవుండు జన్మించినన్

బిడియ మింతయులేక పడతి నిర్భయముగా
గౌరవమ్ముగ నిల్లుసేరునాడు
యుగయుగాల కులాల యూబిలో దిగవడ్డ
పంచమీయుడు పైకివచ్చునాడు

సరసజ్ఞుడగువాడు సాహితీమర్మమ్ము
గుఱుతించి మేలిమి నెఱుగునాడు
విధ్యుక్తధర్మమ్ము వివరించు నుద్యోగి
ఋజుమార్గమున ప్రవర్తించునాడు

చీడపురుగులయిన చెక్కభజనపరు
లర్థమున్నవారి యంఘ్రిపూజ
మానునాడు దేశమర్యాద కొకస్థాయి
తనరు నిజమదియ స్వాతంత్రవేళ

ఎవడురవాడు ముందునకునెట్టి విపత్తులు దేశమందు సం
భవిలునో? యొంటిగానడచు మానిని మానము భంగపుచ్చి
పాం
గివెడలునే? జనోద్ధరణ కేవల మిట్టిదియైన నీస్వాతం
త్రవిషయమందు నెట్టివి దురాగతముల్ విననున్నవారమో

అహము కల్గినవారి కందించె సౌఖ్యంబు
సురవాణి శిరమెత్తి తిరుగువేళ
ధర్మమ్ము పేర నధఃపతనంబైరి
దిగువవారు సువర్ణయుగపువేళ

ఋతమొ? యనృతమొ? యేమెఱుగకుండగనె చా
డీలు నమ్మెడి రాము డేలువేళ
హితజనమ్ములవాక్కు నెదిరింపగాలేని
నృపవతంసములు పాలించువేళ

ఎవడురా! దోచుకొన్నాడు పృథులసుఖము
హైందవమ్మెలరా! నేటికయ్యె నిటుల
పూజ్యబాపుజీ యీనేల పుట్టకున్న
ఏదిరా స్వేచ్ఛ? యీజాతియేమొగానొ?

ఈప్రణాళికలచే నేనాడు తగ్గును
వెనుకబడ్డ కులాల పేదతనము
ఈప్రచారాలచే నేనాడు మాయును
ప్రథము లాంధ్రుల యంటరానితనము
ఈప్రసంగాలచే నేనాడు తరలును
కుపితోగ్రమగు దరిద్రపుశిఖండి
ఈమహాసభలచే నేనాడు ప్రబ్బును
సమతజూపని బానిసపుతనమ్ము

వట్టినినదమ్మువలన రాదెట్టివిజయ
మాత్మవంచన లేనట్టియమృతదీక్ష
పాలనము సేయువానిలో ప్రబలునాడు
కలుగు సుఖమోదములు ప్రజావళికి నాడు

కొదవల్ తీరెనె? దేశభక్తుల సుధోక్తుల్ పండెనే? నేడు ము
ప్పదిమూడేండ్ల మహోత్సవమ్ము జరిపింపంగన్ సమైక్యంపుట
భ్యుదయం బబ్బెనె? యుచ్చనీచతలలో నూగాడు దేశానకున్
పదిలంబేది? యెవండు దేశమునుగాపాడున్ మనఃస్ఫూర్తిమై

ఈ యస్పృశ్యత యొక్క శాసనముతోనే పోవు; గానీ యెవం
డీయాశ్చర్యపుచట్టమున్ సలుపచేయెత్తున్, కరంచందు గాం
ధీయాదర్శము లీ ధరాతలములో ధిక్కారముంబొందె న
న్యాయంబన్న కులాలభేదములతో నాటాడింతు రీనాయకుల్

కలిగిన స్వేచ్ఛకున్ తనువు గంపెడుతోషణమందగా సుఖ
మ్ములు నోన గూడునన్నతలపుల్ గిలిగింతలుపెట్టగా. నిరా
శలవల లుచ్చులొడ్డినవి సాధుమసీషికి నీ దగామను
ష్యులకెసుమీ! స్వతంత్రత యహోయను నాదము మిన్ను
ముట్టెడిన్

హత్యలు దోపిడీపనులు హానికరంబగు రాజకీయముల్
నృత్యము సేయు దేశమున కెన్నడుగల్గు ప్రశస్తసౌఖ్యముల్
నీత్యవినీతిభేదములు లేనటువంటి ధరాతలాన సా
హిత్యసరస్వతీచరణహృద్యమహోద్యమ నాట్యముండునే?

తనకర్తవ్యము పూర్తిగామఱచి చందా లెత్తుచున్ కుక్షికై
అనయంబున్ చరియించి 'పోజు' లిడు నాయంబ్రహ్మ నేడీదిన
మ్మున స్వాతంత్ర్యముగూర్చి వెఱ్ఱివచనంబుల్ పల్కుచో
గుండె గ్రు
చ్చినభల్లమ్మగు నేదిరా! యెవడు రక్షించున్ ఋషిస్థానస్థలిన్

చరియింపవలె హిందుధరణీతలమ్ములో
నల యశోకునిదైన యంతరాత్మ
జరుగగావలె నహస్కరు గుమారుని నేల
తియ్యందనంపు టాతిథ్యగరిమ
పురికొల్పవలె నార్షపరమధర్మజగాన
ననవద్యచరితమా త్యాగదీక్ష
కురియగావలె గాంధికవలయక్షేత్రాన
సహనసత్యాహింస శాంతిసుధలు

సత్యమునకు పూజసల్పి న్యాయమ్మునే
నమ్మువాని యడుగుదమ్ములకును
గట్టవలయు గొప్పపట్టమ్ము నానాడు
సంతసించు దేశజనని నిజము.

## సుంకము

ఏక్రౌర్యానకు తావునీయకయె మున్నిసర్వసర్వంసహా
చక్రిమ్మున్ పురిగొల్పి జాగృతవిశిష్టజ్ఞానచైతన్యకాం
తిక్రాంతిన్ వెదచల్లెనో యరయ నా దేశమ్ము శుల్కంపుహిం
సాక్రూరత్వపు బానిసత్వమున ధ్వంసంబౌట గర్హించెదన్

అతివకు గౌరవమ్ముగలయట్టి ప్రదేశములోననెప్డు దే
వతలు పచారు సేతు రనుభావము నిక్కము వేదకాలభా
రతమున మానినీమణుల ప్రజ్ఞకు పట్టముగట్టినట్టి మేల్
కతలుపఠింప నేటికవి కానమటంచు నిరాశ కల్గెడిన్

మహనీయమైన క్షమాసంపదౌన్నత్య
సామరస్యంపువాత్సల్యజలధి
కునుకుజెందిన వంశమును ప్రోద్ధరింపగా
తనదిగా తలచు చైతన్యలక్ష్మి

దుష్టచింతకులైన దుండగీడుల దుర
హంకారమును చెండు నపరకాళి
కటికి పేదలగాంచి కరుణాశ్రువుల చిమ్మి
యాదరించినయట్టి యమృతమూర్తి

బ్రతుకుటోడ కెపుడు రతనాలచుక్కాని
తులసి యింటిలోని గెలుపులకును
కాని యట్టిమహిళ కట్నాలపేరుతో
బాధపడుట నాపువా డెవండు!

తనదైనట్టి సమస్తజీవితము స్వార్థంబింత లేనట్టిబు
ద్ధిని యర్పించిన స్త్రీకి గౌరవములేదే? నేటిసంఘాన నం
చను వాదున్ కలిగింపరాదు పురుషుం డన్యాయమున్ జేయనెం
చినచో దెబ్బగు ధర్మదేవతకు యోజింపన్ యథార్థంబగున్

కాసుల్ పేరిట గర్హణీయమగు నీకట్నాల రాకాసికిన్
దాసోహమ్మనునట్టివారల తగాదాలోన నైరాశ్యబా
ధాసంసారపుజీవితాన తనువున్ దగ్ధమ్ముగావించు నా
రీసంకల్పము నాపుచో నచట పర్వెత్తున్ దయా నిర్ఝరుల్.

ప్రేమరసైకజీవనము పెంపొనగూర్చును బాధ్యతాయుతం
బై మసలున్ సమైక్యమున కాయువుపట్టగు నింతిలేనిదే
యేమిటి కీప్రపంచము సహిష్ణుతకున్ సడిసన్నకల్మికిన్
ధామముసాధ్వి శుల్కములధాటికి చిక్కుట దుర్భరంబగున్

ఎలుగెత్తిచాటడే ఈశ్వరచంద్రుండు
అబలకు విద్యముఖ్యాంశ మనుచు
కలమెత్తి వ్రాయడే కందుకూరికులుండు
స్త్రీజనోద్ధరణ సంసేవ్య మనుచు
గద్దించిపలుకడే ఘనుడు వార్ధామాని
తరుణిరక్షణ యార్షధర్మ మనుచు
ప్రకటింపడే దీనబంధువు బ్రహ్మర్షి
మగువసౌభాగ్యంబె మాన్య మనుచు

ఈమనస్వులెల్ల రీవనితలగూర్చి
పలికినారు సరియె వారినేలు
వారియెదలయందు స్వారిసల్పెడు కట్ట
నపుపిశాచి తొలగెనా! తలంప.

అనురాగాంబుధిలోఁ బ్రయాణమును చేయంజాలగా దీక్షమై
చను రాగోజ్జ్వలమూర్తులన్ మధురసంసారాశయానందులన్
చెనకన్ జూచెడు దాష్ట్యశుల్కమును చెండించుచోఁ దేశమం
దనయంబున్ చరియింత్రు నిర్జరులు ప్రహ్లాదమ్ము దేశానకున్

ఈ నా సహోదరీప్రాణాంతకంబైన
కట్నమ్ము గాలిలోఁ గలియునాడు
ఈ నా ప్రధానసంస్కృతికి కుఠారమౌ
శుల్కమ్ము జలధిలోఁ జొచ్చునాడు
ఈ నా యఖండదేశానకు మచ్చయై
చెలగు సుంకపువాళ్ళిలు చెరగునాడు
ఈ నా మహోన్నతధ్యానాన కరిదైన
వరకట్నభూతమ్ము సురుగునాడు

ఎప్పు డీయుంకువకు స్థానమియ్యకుండు
నో; నవసమాజ మపుడె మహోజ్జ్వలంపు
ప్రత్నచైతన్య మీాధరాభాగమందు
పరమమోదమ్మువహియించి పంచుకొనును.

18-8-80

## విశ్వసౌభ్రాత్రము

స్వేచ్ఛాహర్షంబగు నీవిశాలజగతీవృత్తమ్మహింసాపతా
కచ్ఛాయానిలయాన నిల్వబడి మైక్యస్నేహబాంధవ్యరా
గాచ్ఛోన్మేషసుగంధమారుతము లాఘ్రాణించి శాంత్యుజ్జ్వలత్
స్వచ్ఛక్షాంతిపథాన నేగిన జగత్సర్వమ్ము భాసించెడిన్

అగ్నిప్రస్ఫుటకాంతిదేహులగు వా రాపంచభూతాలలో
మగ్నంబైరి తదాత్మభావనపునైర్మల్యమ్ము సర్వప్రజో
ద్విగ్నస్వాంతములందు నిల్చెడిని యుత్తేజమ్ముగల్పించి యీ
భగ్నక్ష్మాస్థలికిన్ బరాబరుల నొప్పుంగూర్చి మేల్కొల్పెడిన్

లేశక్లేశము గానిపింపని క్షణా లేనాడు వ్యాపించి ది
గ్దేశాలన్ తనియింప జేయునో ? ధరిత్రీదేవి యానందవా
రాశిన్ గాహనముంబొనర్చెడిని గర్వస్ఫూర్తి నానాడు ది
గ్రాశిన్ బంధురముగ్ధమోహనపుసౌభ్రాత్రమ్ము చుంబించెడిన్

భీతింగొల్పెడు దుష్టపద్ధతుల యాభీలంపు టణ్వస్త్రగా
ఘాతాత్పర్యములో నహర్నిశము చింతాక్రాంతమైమ్రగ్గి పౌ
రాతన్యప్రభ దేలు భూస్థలిని స్వార్థత్యాగపున్ గౌముదీ
జ్యోతి స్సంపద లెల్లవేళలను గాచున్ గాక! చంచద్గతిన్

శిష్టంబైన మనోజ్ఞసంస్కృతులు విచ్ఛేదమ్ముగాకుండ సం
క్లిష్టంబైన సమస్య లీవసుధలో లేకుండ హింసాధురా
దుష్టత్వానకు తావులేని ఘడియల్ తోరాన తారాడుచో
స్పష్టంబైన ప్రశాంతిసౌఖ్యములు విశ్వానన్ పురాణించెడిన్

ఈజగతీగృహాన వసియించిన మానవజాతి యెల్ల న
వ్యాజముతో పరస్పరవివాదములేని యొకేకుటుంబమై
రాజిలి సర్వదేశముల ప్రాంగణసీమల హర్షతోరణల్
రాజి నలంకరించునెడ రాజిలు కుంభిని భాతృభావముల్

తరతమభేదముల్ మఱచి ధార్మికజీవనముం బొనర్చి యా
పొరుగుననున్నవారి తమపోలికగా మనమందు నెంచి సం
బరపడి సర్వమానవుల బాగునుగోరినవేళ విశ్వమం
దురుతరభ్రాతృభావనమహోన్నతబంధము లావహించెడిన్

పౌరపాచ్చ్యమ్ములుగల్గు వర్గములపొందున్ పొత్తులున్
ధూర్తదు
స్తరదార్జన్యపుటుద్ధతిం దవులు యుద్ధజ్వాల తైక్ష్ణ్యమ్ము లీ
ధరలోఁ గన్పడరాదు శాంతిసుమగంధంబుల్ గుబాళించుచోఁ
నిరవై దిక్కులకౌఁగిలించెడిని నా డీ విశ్వసౌభ్రాత్రముల్

ఇక్కడ నీప్రపంచమున నెప్డు మహాత్ములుపెన్ విభేదపున్
ఫక్కికి తావునీయ రిక వారలవాక్కులు వేదకాలపున్
బుక్కులు వారి కీవసుధ నెల్లలు తోయధులున్ దిశావలుల్
నిక్కముగాఁగ నొక్కటియె నీతికి పట్టము గట్టగావలెన్

సౌహార్దభావాన సంపన్న దేశాలు
కుములు భూముల నాదుకొన్న వేళ
సకలరాజ్యాలు స్వేచ్ఛాశాంతివాతావ
రణములో రహియించి ప్రబలువేళ
పశ్చిమపాశ్చాత్యవర్గీయమైన రం
గులభేదములులేక మెలగువేళ
వైదగ్ధ్య పాండిత్యప్రతిభావిశేషాల
కంతరమ్ములు సూపనట్టివేళ

కల్మషంపుభావగుల్మముల్ చివురింప
నట్టివేళ జగతి యలరువేళ
వెలయు శాశ్వతముగ విశ్వసౌభ్రాత్రమ్ము
నరుల పెదవుల చిఱునగవు లొలుక.

20-12-82

## ఉ గా ది

పలుకునిగారపుంబసకు పట్టము భూవలయానగొన్న మా
తెలుగుపొలాలలోన గడిదేఱిన తొల్లిటి సంస్కృతిప్రభన్
నిలుపుము దుర్మతీ ! యదియ నీవలనన్ నిలువంబడున్ జగా
వెలుగులు కుప్పవోసి మురిపింపుము మమ్ముల తెల్గు
వారలన్

అసమనై పుణి జూపి యాంధ్రకళాదేవి
నటియించె భువనఘంటాపథాన
ఆంధ్రసౌభాగ్యముల్ హావణిల్లగా వైశ్య
నాథుండు జలధియాన మ్మొనర్చె
అరుల గుండియలు వ్రయ్యలసేసి యాంధ్రకీ
ర్తిపతాక మెత్తించె రెడ్డికులుడు
ఆంధ్రు లౌదార్యమ్ము లలరార గ్రంథాన
సాతవాహన రాజు సంతరించె

నీకు తెలియదులే ? దుర్మతీ ! కఠోర
నియమబద్ధు డాంధ్రుండు నిర్నిద్రకీర్తి
విసరు డాతని కీవేళ వెలితియైన
యేకతాభావము నెడంద నేలనిమ్ము

బలిసిన సాహసమ్మున నవక్రపరాక్రమధుర్యులౌ యశో
నిలయులు తెల్గువారలు మనీషులు సీమలు దాటి రాజ్యముల్
నిలిపిరొకప్డు నేటికిని నిల్చిన తెల్గుల వెల్గుజిల్గులో
కలయకనుంగొనన్ తెలియగా నగునోయి యుగాది సత్ప్రభూ!

అలవాలై సతతమ్ము క్రొంబసిడి సస్యాలన్ పిసాళించు భూ
ములు మా తెల్గుల వీప్రపంచమున ఔమ్మున్నిల్పి శౌర్యోజ్జ్వలో
జ్జ్వలతన్ చాటినయట్టి తెల్గుల మహౌదార్యమ్ము దేశాలలో
పల హుందాగ చరించుచుండుట మహద్భాగ్యమ్ముగా
నెంచెదన్

మెచ్చెనా యెదియైన మేల్మికాన్పించుచో
నరుసమందుటలోన తిరుగులేదు
ఇచ్చెనా తలచుచో హృదయమ్ముపొంగ దా
నముసేయు చేతికి నెముక లేదు

చొచ్చెనా గాఢనిష్ఠురకార్యమందైన
సంకల్పబలమున జయమునొందు
నొచ్చెనా యదియాఱునూరైన మెదిమైన
నిష్ఠమై దరికిరానీయ డెపుడు

ఎంతయున్నతుడో యాంధ్రుఁ డెంతహృదయ
మున్నవాడో? మరెంతటి యుజ్జ్వలంపు
గాథ గలవాడొ? యోయి! యుగాది! నీదు
సముఖమున జెప్ప మాకవసరము లేదు

కలముల్ గ్రుమ్మిన మేల్కవిత్వ నళినీగంధాలతో భాగ్యరా
శులతో నిర్మలపుణ్యతీర్థములతో జోకైన నాజూకుతో
వెలుగుల్ చిమ్మిన తెల్గునాటిచరితల్ విశ్వప్రపంచపుజో
తల నీరాజనమందె దుర్మతి! యథార్థంబౌను వాచింపగన్

గుండెన్ జూపి యమోఘధైర్యమున వాకో బూన నవ్వేళ ను
ద్దండప్రేరితుడై నిలంబడెను స్వాతంత్ర్యంపుపోరాటపున్
జెండాతాల్చి దిగంచలావళులు జేజేల్ గొట్ట త్యాగైకభా
వుం డీయాంధ్రుడు దుర్మతీ! తెలిసికోమోమ్మా! తెల్గు
వైభోగ్యముల్

రసికావతంసుడౌ రాజుని కవితతో
గొనబార సుకవి 'రా' కొట్టునాడు
కవివాక్కులకు శిరఃకంపమ్మొనర్చి పా
ర్థివుడు కస్తురిని నందించునాడు
కవితకు వెలగట్టి కవిని ఆడేన్గుపై
కుతుకాన నెక్కించుకొన్ననాడు
సార్వభౌముని ప్రశస్తంబైన కవితకు
స్వర్ణాభిషేకమ్ము జరుగునాడు

యేమిరా! తెల్గుకవులకు నెంత లేసి
గౌరవార్హతల్ కలిగించె కాలమపుడు
నేడురా! నేటికవులకు వేడుకలరె;
అంజయ్యాబ్రహాముల కవితాదరమున

ఒకడు గలాడు ప్రోలయ మఱొక్కడు కాపయవేమనాఖ్యు డిం
కొకడు ప్రతాపరుద్రు డొకడూహకు తిమ్మరుసయ్య గంగడిం
కొకడు మఱొక్కడున్ వెరశి యుజ్జ్వలమైన తెలుంగుధాత్రి భా
వికి మహనీయమౌ తెలుగువెల్గులువీరలు వత్సరప్రభూ!

ఎత్తింపవలయు మహీచక్రగగనాన
నా తెల్గుజాతీయ కేతనమ్ము
చాటింపవలయు దిశాభూములందున
నా తెల్గుబడి మరందాలపలుకు
వెలిగింపవలయు పృథ్వీధరాభాగాన
నాయాంధ్రజాతి విజ్ఞానదీప్తి
మురిపింపవలయు సంబరముమీఱగ ధాత్రి
నా తెల్గువారి యౌన్నత్యచరిత

నేతిబీరలోన నేయిలేనివిధాన
నీదుపేరులోన లేదు చెడుగు
దుర్మతీ సమైక్యదోహద మీతెల్గు
వారికిమ్ము నేటిపర్వవేళ

నాజాతీయుల కెల్ల వేళల నమందానందసౌహార్దదీ
క్షాజాగ్రన్నవతాప్రధానహితమార్గానన్ ప్రయాణింప ను
త్తేజశ్శ్రీల ననుగ్రహింపుము జగచ్ఛ్రేయోభిలాషుల్ యశో
భాగ్జుల్ భోగులు మాటదప్పని కళారాగుల్ తెలుంగుల్
సుమీ !

ఈవేళ నా తెల్గుజీవుని తలపులో
చిందాడె విలసితానందరేఖ
ఈరోజు నా తెల్గు బృందావనమ్మున
ధ్వనియించె స్నేహచైతన్యగీతి
ఈనాడు నా తెల్గువాణీప్రపంచాన
తలమెత్తినది కవితాలతాంగి
ఈవాసరమున నా యీ తెల్గులోకాన
నడయాడినది కళానాట్యలక్ష్మి

సాగరముల గిరుల ఝరుల నీనాడు నా
తెలుగువాఁడు దాటు తేరు నడపి
పలుకరించి వేయిబాహువులను సాచి
హాయిగూర్చుమోయి! యో యుగాది!

ఉగాది 5-4-1981

# ప్రత్యభినందనము

నుతిగొన్న గోల్కొండకృతిగొని సంతసం
పడె బెజవాడ గోపాలరెడ్డి
ప్రథమభాగంబైన పర్జన్యకావ్యమున్
చెలువారగొనియె సంజీవరెడ్డి
అరుసానగొనె నక్షరాభిషేకపుకృతి
దీపాంగనను బీ. ప్రతాపరెడ్డి
ఆమ్రపాలీకావ్య మలరగా కృతినొందె
నెయ్యాన మాలకొండయ్యరెడ్డి
నాడు కవిసార్వభౌము శ్రీనాథు డెలమి
రెడ్డిరాజుల సాహిత్యదృష్టికతన
సాగినాడిప్పు డీకవిసార్వభౌము
డెటులసాగునో కాలమే యెఱుకజేయు.

నాకృతినాథు లందఱు ధనంజయు నంతటివారలే; జగ
చ్ఛ్లాఘకులె, ధర్మలోకనపురూపులె, మోహనదాసుగాంధ్యహిం
సాకమనీయమార్గమున సాగినవారలె; నా యదృష్ట మి
ట్లైకనిపించె వ్రాసెద సుధామలమంజుల సత్కవిత్వమున్

ఖేదాగారములోన జిక్కువడి సంక్లిష్టంపు ఘట్టాలలో
చేదున్ మ్రింగిన నాసరస్వతికి హర్షీభూతచేతస్కుడై
మోదంబిచ్చిన *అయ్యదేవర కులాంభోదవ్యబ్జవైరిన్ సదా
ఖాదీమానిపథమ్ములో జనిన దిగ్దంతిన్ ప్రశంసించెదన్

కుచ్చితమైనపోకడలకున్ జననట్టి రసజ్ఞు లెందఱో
మెచ్చి బహూకరించిరి ప్రమేయములేనటువంటి వర్ణ్ణపున్
మచ్చకు దూరులై నవసమాజముగోరుచు కుట్మలించె నా
యచ్చపుసాహితీలత యనంతయశోవనభూమి భూయమై

ఈసు, మనస్సులోనెదిగి యెంతయు దుష్టపుచింతచే దుర
భ్యాసములోమునింగిన దురాత్ములు దుర్జనులున్ కుసంస్కృతి
వ్యాసులు పెచ్చుమీరిన దివాణము దగ్ధముగాక యేమగున్?
వ్రాసినవాని వ్రాతకు తురాయి లభించినచో విశేషమే

ఈ గయ్యాళితనంపులోకమున లేనేలేదు మేధావికూ
హాగమ్యంపుతలమ్ము మానవతక్రిందై మట్టిదిన్నట్టిదై
రోగగ్రస్థునిబోలె నున్నది యనారోగ్యంబు పోగొట్టగా
త్యాగబ్రహ్మలు లేచిరావలయు చైతన్యమ్ము గల్పింపగన్

---

* అయ్యదేవర కాళేశ్వరరావుపంతులుగారు

నాలుగక్కరాలు నాలుకపై దాచి
తనదువర్గసభను గొణుగువాని
సాటిలేని సుకవి జమలేని పండితుం
డనెడు లోకమునకు నంజలింతు

కులమును స్వాగతించు విషకుంభినిలోన నభోజగత్తులో
నలిగినవాని సత్ప్రతిభ నాలుగుదిక్కుల వ్యాప్తిసెందగా
వలయునటన్న నెంతశ్రమ వాడోనరింపవలెన్ నిజానకున్
బలమున 'హెర్క్యులెస్' వలెను వాడొకయింత తయారు
గావలెన్

విశ్వనాథకులుండు వినుతించి దీవించె
నా కళాలక్ష్మి యానందమడర
స్వర్ణాభిషేకమ్ము సల్పె బొజ్జా ధర్మ
రాజు నాపల్కులరాణి బొగడి
ధీకుండు కవిపాదుషా కొప్పరాపూరి
పంపించె 'కవిసార్వభౌమ' బిరుదు
వినుతిగాంచిన యాంధ్రవిశ్వవిద్యాలయం
బు రచించెడి 'కళాప్రపూర్ణ' పదము

కూలిచేసి తనువుచాలించె నాతండ్రి
యట్టి తండ్రి యాశ మందుకొనుచు
ఘనతగాంచిన కవిసార్వభౌముండ!
ప్రణతు లివియె రసికవర్యులార!

తానే సత్కవిచంద్రుడై సుకవితాధాత్రీస్థలంబందు నెం
తేనిన్ పేర్గనినట్టి యుత్తముడు నేనేదో యథాశక్తిమై
వాణీసేవనముం బొనర్చెడి సదాభ్యాసుండ నాకిట్టి స
న్మానంబిచ్చిన మాలకొండయ సంభావింతు డెందమ్మునన్

రచనలో నొకింత రసము జాల్వారిన
మాటిమాటికి దనమానసమున
పొంగిపోవునట్టి లింగము మాలకొం
డయ్యకవికి ధర చిరాయురస్తు !

పటుతరమా కవితాలం
పటుడై ధర్మార్థభావభాసురుడై న
న్నిట నెంతో మెచ్చిన శ్రీ
కటకము పురుషోత్తమునకు కైవారమ్ముల్

దొంగలు మానవహంతకులు దోపిడిగాండ్రు దగాచరిత్రు లె
ల్లం గడుహాయిగా బ్రదుకులన్. వెలయించు సమాజమందు కా
కావ్యాంగన లెట్లు జీవితమునందు సుఖమ్ముల నోచుకొందు రె
బ్భంగి కవుల్ సుఖింతురు సవా లిది యీబురుడీజగానకున్

ఛందోబద్ధకవిత్వము
నందుగలుగు శ్రుతివిధానమందున ముదమున్
జెందిన రసికుడు యం. జే.
సుందరరాయనికి వేయిజోతలు సేతున్

కళనుకలుగునట్టి కవిని నుదారనై
ఖరిని గాంచి మంచినెఱపునట్టి
సజ్జనుండు కే. వి. చలపతిరాయని
కీ ధరిత్రి నగుత పృథులసుఖము

కల్లల్ లేనటువంటి మానసముతో గాంధీజి శాంతిక్షమా
వాల్లభ్యమ్మున కంకితంబయిన విద్వాంద్వాంశ్యుడై సాహితీ
ప్రోల్లోంబగు గాంగభంగములపై నూగాడు ప్రాజ్ఞుండు, బీ.
మల్లారెడ్డికి మానవోత్తమునకున్ మాన్యప్రశంసావళుల్

వన్నె వాసిగొన్న వెన్నెన్నొ శాస్త్రిలు
సావధానమతిని చదివినారు
సహృదయతను మీకు సరిలేరు వందనా
లబ్బ! దంతులూరి సుబ్బరాజ!

అమృతమూర్తియైన అన్నపురెడ్డి శ్రీ
రామరెడ్డి వసుధ ప్రబలుగాక
రామరెడ్డి మీ వరాలవాక్కులలోన
జూఅలాడె తెలుగు సోయగమ్ము

విమడు రావిపాటి వేంకటస్వామికి
నాంధ్రుపాలు, కోటయలకు మఱియు
కల్లలకు విరోధి నల్లూరి రామయ్య
ప్రభృతివరులకు నభివాదవితతి

ఢంకాకొట్టి రసైకశబ్దముల నోడ్డాణమ్ముగీలింతు ని
శ్శంకన్ సుందరనాంధ్రశారదకు లక్ష్యంబిద్ది వాంఛింప సా
హంకారంబగుగాక! నేడు సదయుండౌ మాలకొండయ్య నా
వంకన్ దృష్టినిగిడ్చె నియ్యది పురాభాగ్యమ్ముగా నెంచెదన్

ఒకడు శ్రీనాథుండు ప్రకటితసకలభో
గాల భాగ్యాలలో దేలినాడు
ఇంకొకయతడు భక్తేంద్రుండు వాణిచే
నింపుగా వంట చేయించినాడు
వేఱొక్క డుద్దండ వీరావతారుడై
యిచ్చినమాట చెల్లించినాడు
మరియొకం డలసాని మహితవంశోద్భవుం
డేనుంగునెక్కి యూరేగినాడు

పొంగిపోయినావు పులకితగాత్రవై
కన్నులార వారిగాంచినాడు
నేడు కవులపాట్లు నీ వెఱుంగుదువుగా
దివ్యకల్పవల్లి! తెలుగుతల్లి!

27-1-1980

# దుందుభి

ఈ హేరాళమనోజ్ఞమంజుల కళాహేవాక వాసంత స
న్నాహోత్సాహ మహాశుభావహ రసానందైక వేళన్ నిరా
శోహాగీతులతోడ నా ప్రజల కెల్లుల్లాసమున్ కూర్తు నిం
కోహో ! దుందుభి ! నీ శుభాగమన మాంధ్రోర్విన్
కటాక్షించెడిన్

చోటులోగ్రతైక్ష్ణ్య భీషణధురాసంక్షోభ
పైశాచికీ నాట్యభంగిమమ్ము
విషదిగ్ధజిహ్వా సంభృతకరాళక్రూర
ధరల కాలభుజంగ దారుణమ్ము
సమదదౌర్జన్యసంసక్తనైచ్యక్రియా
బహుభయంకర మానభంగవిధము
దుష్టమానవసంఘ దూర్తతాచిహ్న మ
స్పృశ్యతాశార్దూల విహరణమ్ము
నా ప్రజాళిజీవనమును దగ్ధముచేసి
యురముసూపి తిరుగుచున్న వేళ
ప్రియమెలర్ప దుందుభీవత్సరప్రభూ !
వచ్చినట్టి నీకు స్వాగతమ్ము

ఎన్నియుగాదు లీభువిమహీవలయమ్మును చుట్టినన్ వ్యథా
ఖిన్నమనస్కతన్ కుమిలి కృత్స్నకు పట్టెడుకూడు నోచుకో
కున్న దరిద్రమానవుల కుర్వర నెందుల కీయుగాది స
ర్వోన్నతపర్వసంభ్రమములోయి! యుగాది నవోదయాధిపా !

నవతావసంతసంధ్యావేళ వనవీథి
అతనుభృత్యుల గొంతులాడుచున్న
ప్రసవగర్భమునుండి పఱతెంచుసౌరభ్య
సంహతి పయనమ్ము సలుపుచున్న
ప్రకృతిలక్ష్మీదేవి రసమనోజ్ఞప్రథా
లావణ్యభూషయై క్రాలుచున్న
చెలరేగు హర్షాన చిటితేనియలద్రావు
భృంగసంతతి శబ్దమీనుచున్న

పరిమళాలసొబగు లురల కంఠంబెత్తి
స్వాగతమ్ము ప్రకృతిపలుపుచున్న
మేటిదైన్యరేఖ దాటని నాప్రజా
వితతి కేది దుందుభీ ! సుఖమ్ము

ఈ యందాలవనాలప్రాంగణ లసచ్ఛృంగారచైతన్యరే
ఖాయత్తప్రభకున్ వసంతు డొగి చిహ్నంబై పురాణించు నీ
వీ యేటన్ కుఱెపింపగావలయు నోయీ! దుందుభీ! నాజన
శ్రేయంబై సుఖమింత దుర్మతిని వాచింపన్ వృథాయాసమా

ఈ చైత్రంపురథమ్మునెక్కి కడుహాయిన్ నీవు నా తెల్గువీ
థీచైతన్యపథాలనెల్ల గనుచో దిక్చక్రరాశీప్రశం
సాచిహ్నావళులన్ కనంగలవులే; సౌదర్యభావమ్ములన్
పేచీలుంగల నా తెలుంగులకు నేర్పింపంగ నర్థించెదన్

కూలినవానిజీవితపుగోడులు నీమరణాలు మానభం
గాలు మఱెన్ని దోపిడులు కక్షలు హత్యలు బందుబస్తుగా
పాలనచేయుచున్నటుల భావనఁ గల్గకపోదు దుందుభీ!
తూలిన జీవితాలకు నెదోయొకదారిని చూపగావలెన్

ఇటు నీరాకకు దోయిలించెదను గానీ నావిశాలాంధ్రది
క్కటముల్ కంపిలె తిండితిప్పలకు దుఃఖానన్ దరిద్రాళిహృ
త్పుటముల్ భేదనమయ్యె దోచుకొనుటే? పుణ్యమ్ముగానెంచు
సం
కటపున్ చేష్టను సాగనీకు ఋతుశక్రా! నూత్నవర్షప్రభూ!

తేరాగా బ్రతుకీడ్చువంచకులకే దేశాన సత్కారముల్
భారీమొత్తున సాగుచో నిలుచునే? బాపూజి స్వప్నద్యుతి
శ్రీరమ్యోహాలు వర్గసంస్కృతికి పుస్తెన్ కట్టుచో జాతిసం
స్కారంబెప్పటికైన దగ్ధమగు టీకాటిప్పణుల్ వ్యర్థముల్

కుంచాకోరుల దుండగీండ్ర కటకున్ గూండాల దౌర్జన్యపున్
కాండౌద్ధత్యము మానవత్వమును మంటన్ కల్పి దర్జాగ నా
ఖండానన్ విహరించుచున్నది మహోగ్రంబైన రూపమ్ములో
చెండింపింపుము దుందుభీ! యిదియెపో! క్షేమమ్ము నాజాతికిన్

పూయింపింతువొ? నామహాంధ్రజననీవ్యూహాధరాజమ్మునన్
కాయింపింతువొ? నాజనాళి హృదినైక్యస్నేహచాంద్రీద్యుతిన్
త్రోయింపింతువొ? యీయరాజకపుతంతున్ నిల్వనీకుండగన్
మ్రోయింపింతువొ? హర్షదుందుభుల తెల్గుల్ మెచ్చ వర్షాధిపా!

క్షణికంబైన సుఖాలుకోసరము లక్ష్యంబుంచి [illegible] లమా
ర్పునకున్ సమ్మతిసూపు పెద్దలు కులమ్ముల్ [illegible] కోజాల్లుగా
సనమున్ చేయరదేల? కూహకమన స్త[illegible] విజ్ఞానమున్
తనఖాపెట్టెడు బుద్ధి నాప్రజలకున్ రానీకు వర్షపతీ!

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No.

ఈ నా సరస్వతీహృద్యవాఙ్మంజీర
          శింజినీధ్వానాలు సెలగునాడు
ఈ నా మనోవీథి నెసలారుభావాలు
          కెరలి నిర్భయముగా తిరుగువాడు
ఈ నా యనుదినంపుభృతికి ఢోకాలేని
          వెల్గురాదారులు కల్గునాడు
ఈ నా మహాసాహితీనవతాపుష్ప
          సౌగంధ్యములు దెసల్ సాగునాడు

నాడు నాలోనదాగిన నవసుశబ్ద
భావబంధురతాపరంపరలు వరలు
విసపుకోలముల భుజగాలు ముసరుకొన్న
క్షితిని దుందుభీ! ప్రతిభకు బ్రతుకు లేదు

ఇలపై గీరితి నాచికొన్న మొనగాడీ నా మహాంధ్రుండు నే
డలుసై పోయిన సంగతిన్ తలప బ్రహ్మాండమ్ము విభ్రాంతమై
విలపించెన్ నుడులాన నీవలన ప్రస్ఫీతమ్ముగా దుందుభీ!
చెలరేగన్వలె తెల్గుభూముల నుషశ్రీ దుందుభిధ్వానముల్.

21-3-1982

# గండపెండేర సన్మానము

ఘోషల్ వెట్టెడు నాదు బాల్యమున నుగ్గుంబాలతో పాటు పీ
యూషంబున్ కలబోసి పెంచితివో? లేకున్నన్ మహాసాహితీ
భాషాయోష మదీయ జిహ్వపయి నావాసించునే? నేడు నా
భాషాసత్కృషికిన్ లభించె జననీ! పాపాంబ! యీ సత్కృ
తుల్

అరుసంబుల్ హావణిల్ల మీదయిన యధ్యక్షత్వమం దీయశో
గిరిపై నెక్కిన నాకళాసతికి కగ్గెన్ మేల్మిబంగారు గ
గ్గెరసన్మానము సింగిరెడ్డికులజా! కేల్మోడ్పు సాహిత్యసుం
దరమూర్తీ! భవదీయవాక్కులు మరందశ్రీనిధానంబులౌ

తీయని తేటతెన్గు పదధేనువుబిండి రసైకమాధురీ
గేయకవిత్వమున్నొడివి కీర్తిమరీచుల విశ్వగారవ
స్థాయినినిల్పి యున్నతినిదాల్చిన ధీమణి! సింగిరెడ్డి నా
రాయణరెడ్డి! మీపలుకులందు పసందులు చిందులాడెడిన్

శూలియు వెన్నుడున్ త్రిపురసుందరియున్ పరిశుద్ధు జేసుడున్
వ్రాలిన నేల నాదు నిరవద్యకవిత్వసరస్వతీపదా
బ్జాల నదించు కింకిణుల చక్కనిశబ్దము లేలుగాక! యం
దాలపసిండిపెండెరము దాల్చునుగాక! మదీయవాణియున్

కమనీయసాహిత్యకల్లోలినీతరం
గాల డోలికలలో దేలి తేలి
ఋజువర్తనమునకు ధ్వజముపట్టినవాని
నిచ్చమై హృదయాన మెచ్చి మెచ్చి
అర్థించువారల యవసరంబెఱిగి మ
హోపకృతిన్ చేయూతనిచ్చి యిచ్చి
నవభారతము భువనమున నిల్వగ పరి
శ్రమల కాధారమ్ము నెమకి నెమకి

ఉన్నదంచు గర్వమెన్నడు చూపని
కంటిపూడివంశ కంధిసుతుడు
వేడు కలరజేసె వీర్రాజుచౌదరి
గండపెండెరంపు నిండుసభను

అమితోదారతతోడ నాయలతికావ్యాలన్ సమీక్షించి మో
దము సంతృప్తిగపొంది నాపయి సుబద్ధప్రేమ జూపించినా
రు మహోదారచరిత్ర! చౌదరి! మహేంద్రుల్ మెచ్చుకొ
న్నారు మీ
సమతామానవతాస్వభావమును ప్రస్తావింప తథ్యంబగున్

కళలకు స్థానమిచ్చిన యఖండులు రాజులుపోయి రీధరా
తలమున వారునిల్పిన సుధామయమంజులదివ్యసాహితీ
నిలయములైన సత్కృతులు నిల్చినవిప్పటిదాక యెప్పుడున్
నిలుచును సత్కవీశ్వరులునిండిన భూములు స్వర్గతుల్యముల్

తెనుగున్ దేశము నవ్యభారతములో దీపింప నుత్సాహపున్
మనమున్ గల్గి పరిశ్రమల్ నిలిపిసంభావించు శ్రీచౌదరీ
శునకున్ పుట్లకొలందిగానగు నమస్సుల్ వారియౌదార్యభా
వనచే దాల్చెను నాకళారమణి డాపాదాన పెండారమున్

అనిపించు సాహసంబైన ధైర్యశ్రీల
నచ్చమ్ము మేరుశిలోచ్చయమ్ము
అగుపించు నెపుడు దయాధర్మకార్యాల
దానరాధేయుని తమ్ముడగుచు

రహించు కార్యనిర్వహణదీక్షాబుద్ధి
కలివేల్పుమఱదికి గుఱుతుగాగ
వహించు నెట్టిసభాపర్వమైనను
కృష్ణసారథ్యమ్ము గ్రేణిసేయు

ప్రథితకంటిపూడివంశాబ్ధిచంద్రుండు
మధురమంజుమృదులమానసుండు
విశ్వమానవుండు వీర్రాజుచౌదరి
విలువకట్టె నాదు పలుకుచెలికి

శ్రమలన్ తన్ని నిరంతరవ్యథల భూస్థాపమ్మొనర్చి యు
త్తమసాహిత్యము సృష్టిజేసిన ననున్ ధర్మజ్ఞులై దాతృతా
ధ్వమునం దెప్పుడు సాగు చౌదరికృపాభావమ్ముచే నాయదృ
ష్టముపండెన్ రచియింతు నిర్భరమహాసాహిత్యసంభారముల్

ప్రతిభన్ గాంచి శిరమ్మునూపి కులవర్గంబున్ సమీక్షింప కు
న్నతమర్యాదలుగల్గు కైతలకు నానందించి మెన్నెన్నొ స
త్కృతులం జేసిన నేటిదాతయగు శ్రీశ్రీకంటిపూడ్యన్వయో
న్నతునిన్ చౌదరినిన్ దలంచెదను డెందానన్ కృతజ్ఞుండనై

హర్షమ్ముతోడ నాహ్వానసంఘాధ్యక్ష
పీఠాన నిలిచిన విశ్వహితుడు
శ్రమజీవుల క్షుధానలజ్వాలలో రేగు
నుబ్బునెర్గిన కార్మికోత్తముండు
నాజూకు గల కాకినాడపురానకు
ప్రవచింపగా తొలిపౌరవరుడు
ఋతము మెచ్చుచు హితాహితములన్ గుర్తించి
త్రోవలో నడచెడు ధీవరుండు

ప్రథితయశుడు జ్యోతుల సీతరామమూర్తి
ప్రథమపౌరుడు నా వామపాదమునకు
నరుసమందగ పసిడిగగ్గెరను దొడిగె
తెలుగుసాహిత్యచరితలో నిలిచిపోవ

తొలి యలసానిపెద్దనకు తోరముగాగ పసిండిగగ్గెరన్
చెలిమి వహింపగాదొడిగి నేటికి నీకవితా ప్రపంచమం
దలరిన కృష్ణభూపుని విధాన కవిత్వచరిత్రలోన జ్యో
తులకులదీప! నిల్చెదవు తోషణమొప్పగ బ్రహ్మకల్పముల్

మీమూలమ్మున తెల్గుభాషకు సమున్మేషస్థితుల్ కర్త భా
షామూర్ధన్య! భవన్మహారచన లీసాహిత్యలోకాన కెం
తేమోదమ్మునుగూర్చి గౌరవము నిండింపించె మీమేల్మివి
ద్యామాధుర్యసుభాషితాలకు దోణప్పా! నా నమస్కారముల్

చరితల్ చూడని యక్షగానములకున్ చారిత్రమందించి యూ
పిరిపోయించినయట్టి ధీమణివి యస్వీ. జోగరాయా! యశోం
బరవీథిన్ విహరించు మీ పలుకులమ్మన్ గాంచి సంతోషమం
దిరి సాహిత్యకులిప్డు మీరిడిన సందేశానకున్ జోతలా

సొగసుల్ సిమ్మెడు నాంధ్రభాషకు యశస్సున్ గూర్చ
పాశ్చాత్యులే
పొగడన్ బోధనసల్పివచ్చిన గుణాంభోరాశి! మీవాక్కులో
నెగడున్ సుందరతాప్రబోధములు నందింపించు మీవార్తకున్
అగుతన్ దోయిలి కొత్తపల్లికులదీపా! వీరభద్రాభిధా!

మాయయు మర్మమింతయును మాటకునైనను లేనియట్టి శ్రీ
బాయనవంశజున్ మధురవాగ్మిని వక్తృశిరోమణిన్ జగ
చ్ఛ్రేయముగోరుకొన్న గుణశిష్టుని పాత్రునికౌత వందనా
లీమెడ సత్కవిత్వమన నెంతయుపొంగిన కారణమ్మునన్

నాడు కనకాభిషేకమ్ము నాకు వేడ్క
ఘనులు కొనియాడ చేయింపగలిగినారు
నేడుఁ కూడను గండపెండెరపుసభను
ఘనులు కొండాడ చేయింపగలిగినారు

నగరాలవలన జాషువ
నిగరాలకవిత్వపద్మనేత్రకు కలిగెన్
జగపెండేరపుసభ మీ
దగుకృపిచే నేడు నేను దాల్చితి దానిన్

కారుణ్యమ్మున చౌదరిప్రభువు పక్కాసత్కృతిన్ నాకు నిం
పారన్ చేయతలంప మీరొకరు, నాయందైన ప్రేమమ్ముతో
సారథ్యమ్ము వహించినారలు సభాసంధాతలై నా నమ
స్కారాలాంధ్రధనయోగరా! వినయభూషా! పాతురిధీమన్మణీ!

ఒకకవి కేమికావలయు నుండుట కింతకుటీర మింత తిం
డికిసరిపోవు బత్తెము కనీసపువస్త్రము లింతియేకదా!
సకలమహీతలంపు సుఖశాంతులకోసము పాటుపడ్డ వా
రికి కవులైనవారలకు తృప్తినొసంగని దేశమెట్టిదో?

నావర్గమ్మొక్కటే సమస్తమునకున్ నాందీసుమీయంచు నే
వేవో వాక్కుల నాడు విజ్ఞులకు లేదే హేతువాదమ్ము ప్ర
జ్ఞావైశద్యము లోక్కవర్గమున కేనా గుత్త ? యీమాటలో
జీవస్ఫోరక కాంతి లేదు ఫలియించెన్ నా తపస్సింతకున్

విద్యావార్ధుల సన్నిధానమున నివ్వేళన్ ఋషిప్రోక్త మత్
పద్యగ్రంథ సరస్వతీమృదుపదాబ్జాతమ్ము గీలించె నీ
హృద్యోత్కర్షపు పెండెరంపుసభ నాకిచ్చున్ సముత్సాహదీ
క్షోద్యదీవ్యదనంతభావనలు నా కుర్విన్ తపఃప్లహ్నుడన్

నా కనకాభిషేకతిరుణమ్మున మెచ్చిన యాంధ్రసాహితీ
లోకము నేడుగూడ తమలోని మహోన్నతసంస్కృతిప్రభా
శ్రీకము సందడింప నరుసింతురుగాక సరస్వతీవధూ
టీకమనీయదృఙ్మధురశేవకు లే వెటువంటి భేదముల్

మహితమైనట్టి రామాయణకావ్యమున్
మేల్మి నందించె వాల్మీకిమౌని
ధృతినిర్ధరింప భారతమును రచియించె
పరమధర్ముడు పరాశరునికొడుకు

ఘనకాళికాంబ మోహనకటాక్షమ్ముచే
ఘంటాన వ్రాసెను కాళిదాసు
సమరరంగమున ధీచాతుర్య మలర గీ
తావార్తఁజాటె యాదవకులుండు

మునుపు చదువులేని ఘనులైనవీరలు
కవనవిద్య లరయగలిగి రెటుల?
కవిత పూర్వజన్మగంధమ్మువల్లనే
కలుగుగాని చదువువలన గాదు

ఈసు మనస్సులో నెదిగి యెంతయు దుష్టపుచింతచే దుర
భ్యాసములో మునింగిన దురాత్ములు దుర్జనులున్ కుసంస్కృతి
వ్యాసులు పెచ్చుమీఱిన దివాణము దగ్ధముగాక యేమగున్?
వ్రాసినవానివ్రాతకు తురాయి లభించినచో విశేషమా

ఘనుడగు చంద్రవంశజుడు గాథయశస్కుడు తెల్గుకైతకూ
తనిడు రసజ్ఞశేఖరుడు ధర్ముడు శ్రీహరిరావు నా కళా
వనితకు కాన్కగానొసగె బంధురతోషముతోడ చౌదరీ
ఘనునకు మారుగానిలిచి కైతకు నేడొక పండుగయ్యెడిన్

మేటిదైనట్టి పుష్పకిరీట మొండు
నా శిరస్సున నలరించి నామ కవన
విజయలక్ష్మిని వినుతించి పెద్దచేసె
రసికతామూర్తి కొప్పాక రామకృష్ణ

తాండ్రిపాపయ్యసర్దారు ధైర్యశ్రీకి
ఆకరంబైన తాలూక నాది
కవితావిపంచికాగానమ్ము మ్రోగ్రొమ్మగు
పేరొందు పెదపెంకి యూరు నాది
గీర్వాణభారతకృతి రచించిన మహా
కుశలుడౌ వ్యాసర్షికులము నాది
మహితలక్షణమైన మానవతావాద
భావాన నడచెడు త్రోవనాది

ఏను కవిసార్వభౌముడ! ఏను విశ్వ
నాథ శిష్యుండ! సాహితీనందనమున
బెడగు కబ్బంపువిరుల గల్పించినట్టి
భువనహితుడ! జ్ఞానానందకవిని నేను.

13C1

AOUA1013110 13C

**PILLANA GROVI** Rs. 15-00

నేటిహరిజనకవులలో నీవును జాషువాగారును రెండు శిఖరములవలె నున్నారు. ఆంధ్రకవితాశారద మీ యం దీరీతిగా నృత్యముచేయుచున్నందులకు నా హృదయ మెంతేని సంతోషించుచుండును.

— 2-11-1963

చిరంజీవి జ్ఞానానందకవి నాకు శిష్యుడు. ఈనాటి కవులలో నుత్తములలో నొకడని చెప్పినచో శిష్యాభిమానము కానేకాదు. ఇతడు గొప్పకవి. పద్యరచన ధారాశుద్ధికలిగి సంస్కృతమధురసమాసభూయిష్ఠమై యుండును. ఇతని సీసపద్య మదొకనడక నడచును.

— 23-3-1966

ఆధునిక కవీశ్వరులలో నిస్సందేహముగా నీకు స్థానమున్నది. నీకొక శైలి కలదు. నీపద్యలక్షణము నీదిగా నేర్పాటైపోయినది.

— 4-1-1976

— కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ

## మనము ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | AOUA101B110 |
| పుస్తకం పేరు | పిల్లనగ్రోవి |
| తారీఖు | 31 December 2025 |
| ముందు అట్ట | ఉంది |
| వెనుక అట్ట | ఉంది |
| మొత్తం పేజీలు | 171 |
| పెద్ద సైజు పేజీలు | no |
| ఖాళీ పేజీలు | CF, 3, 5, 7, 19, BC |
| లేని పేజీలు | no |
| తయారు చేసినది | Nandini |
| పేజీలు విడదీసినది | Nandini |
| స్కాన్ చేసినది | Nandini |
| పరీక్ష చేసినది | MADHU MATHI |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| పరిస్థితి | good. |